
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు
బుధవారం 4 సెప్టెంబరు 2024



ఆదోని సబ్ కలెక్టర్‌గా మౌర్య భరద్వాజ్

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 3: ఆదోని సబ్ కలెక్టర్‌గా మౌర్య భరద్వాజ్ నియమితులయ్యారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని కలెక్టర్ పి.రంజిత్ బాషాను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.



కలెక్టర్‌ను కలిసిన మౌర్య భరద్వాజ్



2009 అక్టోబరు 2న కొండారెడ్డి బురుజు వద్ద పోటెత్తిన వరద

ముంపు భయం..!

కర్నూలు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంతో పాటు చుట్టు పక్కల మండలాల్లో హంద్రీ, తుంగభద్ర నదులు ప్రవహిస్తున్నాయి. పత్తికొండ మండలం పందికోన కొండల్లో ఒక పాయగా, చిన్నహుల్తి ఎగువన మరో పాయ (వంక)గా ప్రవహించే హంద్రీనది దేవనకొండ మండలం అలారుదిన్నె సమీపంలో సంగమమై దేవనకొండ, ఆస్పరి, గోనేగండ్ల, కోడుమూరు, కల్లూరు మండలాల్లో ప్రవహిస్తూ.. కర్నూలు నగర శివారు జోహరాపురం బిడ్జి దిగువన తుంగభద్రలో కలుస్తుంది. నగరం మధ్యలో 5.40 కిలోమీటర్లు ప్రవహించే ఈ నది వివిధ ప్రాంతాల్లో 200 నుంచి 300 మీటర్ల వెడల్పు ఉండాలి. గరిష్ఠ వరద ప్రవాహ అంచుల (మ్యాగ్జిమమ్ ఫ్లడ్ లెవల్-ఎంఎఫ్ఎల్) నుంచి 50 మీటర్లు (150 అడుగులు) వరకు నదిగడ్డ వెడల్పు (బఫర్ జోన్) ఉంటుందని జలవనరుల శాఖ ఎఫ్ఆర్ఎల్ డివిజన్ ఇంజనీర్లు తెలిపారు. కోడుమూరు మండలంలో మొదలైన వక్కెరు వాగు ప్యాలకుర్తి, కొత్తూరు, పెంచికలపాడు, నెరవాడ, సలకాపురం, పెద్దపాడు మీదుగా ప్రవహిస్తూ కల్లూరు వద్ద హంద్రీ నదిలో కలుస్తుంది. నగరం పరిధిలో ఈ వాగు గడ్డ వెడల్పు (బఫర్ జోన్) 30-50 అడుగుల వరకు ఉంటుంది.

ప్రభుత్వ భూమే

ఎంఎఫ్ఎల్ లెవల్ దాటి వరద వచ్చినా ఊళ్లు, పొలాలు మునిగిపోకుండా నదీ తీరం వెంబడి 50 మీటర్ల వెడల్పుతో బఫర్ జోన్ అని ఇంజనీర్లు పేర్కొన్నారు. నది ప్రభుత్వ స్థలంగానే రికార్డుల్లో ఉంటుంది. కల్లూరు రెవెన్యూ గ్రామం ఖాతా నంబరు 20000512 కింద సర్వే నం.422-ఎ2, 424-ఏ3, 470-బి, 470-సి, 470-ఇ3, 498-ఏ1బి, 533-ఏ1, 770-ఎఫ్1 పరిధిలో 201.7125 ఎకరాలు, సర్వే నంబరు 470-బి పరిధిలో 49.0925 ఎకరాలు ప్రభుత్వ భూమిగా చూపారు.

సరిగ్గా పదమూడేళ్ల ఏళ్ల క్రితం వరదలతో కర్నూలు నగరం అతలాకుతలమైంది. తుంగభద్ర, కృష్ణమ్మకు తోడు హంద్రీ సైతం ఉప్పొంగడంతో కర్నూలు కోలుకోలేకపోయింది. నేటికీ ఆ ప్రమాదకర దృశ్యాలు, సంఘటనలు ప్రజలను వెంటాడుతున్నాయి. భారీగా ఆస్తి నష్టం సంభవించింది. వేల ఎకరాల్లో పంటలు కొట్టుకుపోయాయి. ప్రశాంత నగరం కాస్తా... ప్రకృతి ప్రకోపానికి వణికిపోయింది. సరిగ్గా అలాంటి ఘటనే ఇప్పుడు బెజవాడలో కనిపిస్తోంది. బెజవాడ ముంపు ఘటన చూసి 2009 అక్టోబరు 2 నాడు కర్నూలు నగరాన్ని ముంచెత్తిన వరద బీభత్సం సంఘటను నగరవాసులు గుర్తు చేసుకుంటున్నారు. కర్నూలు నగరానికి హంద్రీ, తుంగభద్ర నదులు మణిహారంగా ఉన్నాయి. ఈ నదుల పరివాహక ప్రాంతాలన్నీ నేడు కబ్జాలకు గురయ్యాయి. బఫర్ జోన్లను సైతం ఆక్రమించి భారీ భవంతులను నిర్మించేశారు. ఈ నిర్మాణాలతో ఎప్పటికైనా ప్రమాదమే. నదులు ఉప్పొంగితే నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న ఈ నిర్మాణాలు నగర భవిష్యత్‌ను ప్రశ్నిస్తున్నాయి. 270 పైగానే ఆక్రమణలను గుర్తించి నోటీసులు ఇచ్చామని చెబుతున్న నగర పాలక అధికారులు, బఫర్ జోన్‌ను సైతం ఆక్రమించి భవంతులు నిర్మిస్తున్నా జలవనరులు, రెవెన్యూ శాఖల అధికారులు కళ్లకు గంతలు కట్టుకుని చూస్తున్నారు.

2009లో కర్నూలును ముంచేసిన వరదలు


నాడు తుంగభద్ర, కృష్ణా నదులకు తోడు హంద్రీతో భారీ నష్టం

హంద్రీ, వక్కెరు వాగు ఆక్రమణలతో పొంచి ఉన్న ముప్పు

బుడమేరు బీభత్సంతో విజయవాడలో ఊహించని విధ్వంసం

270కి పైగా ఆక్రమణల గుర్తింపు

నగర జనాభా, విస్తీర్ణం పెరగడం, భూమి విలువ చుక్కలు తాకింది. నది పోరంబోకు ప్రభుత్వ స్థలంపై అక్రమార్కులు కన్నేశారు. రాజకీయం, అర్థ బలంతో దర్జాగా కబ్జా చేసి పక్కా భవనాలు నిర్మించారు. మామూళ్లకు కక్కుర్తిపడిన రెవెన్యూ అధికారులు కొందరు డీ పట్టాలు ఇచ్చారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మాయ చేసి రిజిస్ట్రేషన్లు సైతం చేస్తున్నారు. వరదొస్తే కాలనీలకు కాలనీలు ముంపునకు గురవుతుండటంతో రక్షణ గోడ (ప్రొటెక్షన్ వాల్) నిర్మాణానికి ప్రభుత్వం నిధులు ఇచ్చింది. దీంతో సర్వేకు వెళ్లిన అధికారులకు విస్తుపోయే నిజాలు తెలిశాయి. 270 పైగా ఆక్రమణలు గుర్తించి నోటీసులు ఇచ్చామని కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ అధికారులు అంటున్నారు. అంతకు రెట్టింపు ఆక్రమణలు ఉంటాయని సమాచారం. నగరంలోని దేవనగర్‌లో ప్రముఖ రియల్ ఎస్టేటర్, బిల్డర్ ఒకరు హంద్రీ నది బఫర్ జోన్‌ను ఆక్రమించి ప్రహరీ, భవనాలు కట్టేసి యథేచ్ఛగా అమ్మకాలు చేస్తున్నారు. అక్రమ కట్టడాలను అడ్డుకుని నదిని కాపాడాలంటూ ఇరిగేషన్ ఎఫ్ఆర్ఎల్ డివిజన్ ఇంజనీర్లు కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ కబ్జా నిర్మాణాలను పరిశీలిస్తే నదీ ఆక్రమణలు ఏస్థాయిలో ఉన్నాయో తెలుస్తోంది.





దేవనగర్‌లో హంద్రీ నది ఒడ్డునే ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి నిర్మించిన ఇళ్లు

సరిహద్దు గుర్తింపు సర్వేకు నిధులేవీ..?

హంద్రీనది, వక్కెరు వాగు సంరక్షణకు సర్వేనే ఏకైకమార్గం. ఆర్ఎస్ఆర్, ఎఫ్ఎంబీ.. వంటి రెవెన్యూ రికార్డుల ఆధారంగా సర్వే చేసి వాటి సహజ స్వరూపం, బఫర్ జోన్ విస్తీర్ణం గుర్తించి సరిహద్దు పిల్లర్లు ఏర్పాటు చేస్తే కబ్జాలకోరల నుంచి కాపాడవచ్చు. ఈ సర్వే కోసం రూ.45 లక్షలు నిధులు ఇవ్వాలని జలవనరుల శాఖ ఎఫ్ఆర్ఎల్ డివిజన్ ఇంజనీర్లు పంపిన ప్రతిపాదనలకు నిధులు మాత్రం ఇవ్వడం లేదు. నదిని కాపాలంటే సర్వే చేసి సరిహద్దు పిల్లర్ల నిర్మాణమే ఏకైక మార్గమని ఇరిగేషన్ ఎఫ్ఆర్ఎల్ డివిజన్ ఈఈ నారాయణరెడ్డి పేర్కొన్నారు.

ఆ రోజు ఏం జరిగింది

2009 అక్టోబరు 2... కర్నూలు నగర ప్రజలకు చీకటి రోజు. భారీ వర్షాలకు తుంగభద్రలో 9.50 లక్షల క్యూసెక్కుల వరద ప్రవహించింది. కృష్ణా నదిలో 14.88 లక్షల క్యూసెక్కుల వరద ఉంది. హంద్రీనదిలో 68 వేల క్యూసెక్కులకు పైగా వరద ఉంది. శ్రీశైలం డ్యాం గరిష్ఠ నీటి మట్టం దాటి వరద చేరడంతో.. వెనక్కి ఎగదన్నింది. తుంగభద్ర, హంద్రీ నదుల్లో వరద ప్రవాహానికి తగిన దారిలేకపోవడంతో నగరాన్ని ముంచేసింది. అది నిజంగానే నగర వాసులు జీవితంలో చీకటి రోజు. ఇలాంటి పరిస్థితి భవిష్యత్‌లో రాకుండా ఉండాలంటే హంద్రీ, వక్కెర వాగులను సర్వే చేసి సరిహద్దులు గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. హైదరాబాద్‌లో హైడ్రా తరహాలో ఆక్రమణలు తొలగించి నది స్వరూపాన్ని సంరక్షించాల్సి ఉంది. .

అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకుంటాం

● కర్ణాటక మద్యం, గంజాయి రవాణాను నియంత్రిస్తాం ● డీఐజీ కోయ ప్రవీణ్ కుమార్

ఆలూరు, సెప్టెంబరు 3 : అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తామని డీఐజీ కోయ ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం ఆలూరు పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. అనంతరం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ సరిహద్దు చెక్ పోస్టుల ద్వారా కర్ణాటక మద్యం, గంజాయి రవాణాను అడ్డుకుంటామని అన్నారు. అలాగే పేకాట, మట్కా నియంత్రణపై దృష్టికి సారించాలని సిబ్బందిని ఆదేశించారు.. నేరాల నియంత్రణకు పూర్తిస్థాయిలో పని చేస్తామన్నారు. ఆయన వెంట పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య, ఆలూరు సీఐ శ్రీనివాస నాయక్, ఎస్సై వెంకట నరసింహులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఐజీ కోయ ప్రవీణ్ కుమార్

దేవనకొండ: దేవనకొండ పోలీసు స్టేషన్‌ను రాయలసీమ డీఐజీ కోయ ప్రవీణ్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. రికార్డులలో వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని సీఐ విజయభాస్కర్‌కు సూచించారు. మండలంలో ఫ్యాక్షన్ ప్రభావం తగ్గుముఖం పట్టిందని, అసాఘింక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపుతామని అన్నారు. జిల్లాల విభజన నేపథ్యంలో పోలీసు స్టేషన్లలో సరైన స్థాయిలో సిబ్బంది లేక ఇబ్బందులకు గురవుతున్నారని, తొందర్లోనే స్టేషన్లలో సిబ్బంది కొరత లేకుండా చూస్తామని అన్నారు. ఆయన వెంట పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య ఉన్నారు.

పత్తి ధర పైపైకి..

క్వింటం రూ. 8079

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 3 : ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. గత వారంతో పోల్చితే పత్తి ధర క్వింటానికి రూ.300 పెరిగింది. మంగళవారం పత్తి ధర గరిష్ఠంగా క్వింటం రూ. 8079కు చేరుకుంది. పత్తి ధరలు పెరుగుతుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది నుంచి పత్తి ధర క్వింటం రూ. 7500లకు మించలేదు. మళ్లీ ధరలు పుంజుకోవడంపై ఖరీఫ్‌లో సాగు చేసిన రైతుల ఆశలు ధరలపై చిగురించాయి. 357 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర రూ. 4112, గరిష్ఠ ధర రూ. 8079, మధ్యస్థ ధర రూ. 7777 పలికింది.

జీడీపీ ఆయకట్టు రైతుల్లో ఆశలు

2.5 టీఎంసీల వరద నీరు చేరిక

గోనెగండ్ల, సెప్టెంబరు 3: గత మూడు నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా గాజులదిన్నె ప్రాజెక్టుకు వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 2.5 టీఎంసీ నీరు వచ్చి చేరింది. దీంతో వచ్చే రబీలో ప్రాజెక్టు ఆయకట్టు సాగుకు నీటి కొరత ఉండదని రైతులు ఆశాభావంతో ఉన్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 4.5 టీఎంసీలు. ప్రాజెక్టు కింద ప్రతి ఏడాది రబీ సీజన్‌లో 25 వేల ఎకరాల ఆయకట్టు సాగు కావాల్సింది. అయితే ప్రస్తుతం జీడీపీలో ఉన్న నీటితో దాదాపు 10 వేల నుంచి 13 వేల ఎకరాలకు సాగు నీరు అందవచ్చునని రైతులు అంటున్నారు. ఆగస్టు నెల చివరి వరకు ప్రాజెక్టుకు వరద నీరు చేరకపోవడంతో రబీలో ఆయకట్టు పొలాలను బీడు పెట్టుకోవాల్సి వస్తుందని అనుకున్నారు. అయితే గత వారం రోజులుగా కురుస్తున్న వానలకు ప్రాజెక్టుకు వరద నీరు చేరుతోంది. తాగునీరు అందించే బండగట్టు, కిష్టగిరి, జోన్ పథకాలకు నీరు అందుతుందని అధికారులు అన్నారు. కోడుమూరు, కర్నూలు ప్రాంతాలకు తాగునీటి సమస్య ఉండదని అన్నారు.



గాజులదిన్నె ప్రాజెక్టులో ఉన్న 2.5 టీఎంసీల నీరు

చంద్రబాబును చూసి నేర్చుకో

● బురదలో ఫొటోలకు ఫోజులివ్వడం కాదు
● టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు



కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 3: వరద బాధితులకు సాయం చేయడమంటే పది నిమిషాలు బురదలో దిగి ఫొటోలకు ఫోజులివ్వడం కాదని, చంద్రబాబును చూసి జగన్ నేర్చుకోవాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయవాడ పరిసర ప్రాంతాల్లో వరద బాధితులకు రూ.వంద కోట్ల విరాళం ప్రకటించి జగన్ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. వరద ప్రాంతాల్లో ఇబ్బందులు సృష్టించి, టీడీపీ ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రకాశం బ్యారేజ్‌ను బోటుతో గుద్ది డ్యామ్‌ను దెబ్బతీసేందుకు, బుడమేరు చెరువుకు గండ్లు పడేందుకు వైసీపీ బ్యాచ్ కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు.

డొక్కా సీతమ్మ బడి భోజనానికి రూపకల్పన



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 3: రాష్ట్ర ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి ఆదేశాల మేరకు డొక్కా సీతమ్మ బడి భోజనం మెనూను తయారు చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని కలెక్టర్ పి. రంజిత్ బాషా పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం మెనూ రూపకల్పనపై డిప్యూటీ డీఈవోలు, మండల విద్యాశాఖాధికారులు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ మెంబర్లు, హెడ్‌మాస్టర్లు, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ సెక్రటరీలతో కలెక్టర్ వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకం కింద పాఠశాలల విద్యార్థులకు పోషక విలువలతో భోజనం అందించడం ప్రభుత్వ ఉద్దేశమన్నారు. స్థానిక సంప్రదాయాలు, ఆహార అలవాట్ల ప్రకారం మెనూ తయారు చేస్తున్నామని తెలిపారు. వర్క్‌షాపులో జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్, జిల్లా పరిషత్ సీఈవో నాసరరెడ్డి పాల్గొన్నారు.

ఐదో రోజూ అదే జోరు

కర్నూలు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం రాత్రి కూడా విస్తారంగా వర్షాలు కురిశాయి. జిల్లా అంతటా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడ్డాయి. గత నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు జిల్లా అంతటా తడిసి ముద్దయింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పత్తి, టమోటా, వేరుశనగ, మొక్కజొన్న వంటి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దాదాపు మూడు లక్షల హెక్టార్లలో పంటలు దెబ్బతిని నష్టపోయామని రైతులు ఏకరువు పెడుతున్నారు. ఇలాంటి సమయంలో మంగళవారం ఉదయం కాస్త తెరిపిచ్చి ఎండలు కాయడంతో ఊపిరి పీల్చుకున్నారు. మళ్లీ సాయంత్రం 5 గంటల తర్వాత ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా కుండపోత వర్షం మొదలైంది. ముఖ్యంగా కర్నూలు నగరంలో ఏకధాటిగా రాత్రి 8 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు కుండపోత వర్షం కురిసింది. వీధులన్నీ జలమయమయ్యాయి. ఉల్చాల రోడ్డు, రైల్వే కూడలి జంక్షన్, అశోక్ నగర్, కప్పల్‌నగర్, ఆర్టీసీ బస్టాండు ఏరియా, వన్‌టౌన్ ప్రాంతాల్లో రోడ్లపై భారీ ఎత్తున నీరు చేరడంతో రాకపోకలు స్తంభించాయి. ప్రజలు ఇంటి నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. నగరం తడిసి ముద్దవడమే గాకుండా వీధులన్నీ జలమయం కావడం, వర్షం తగ్గకపోవడంతో నగరవాసులను ముంపు భయం వెంటాడుతోంది.





వరద బాధితులను ఆదుకుంటాం

రూ.10 లక్షల విరాళం ప్రకటించిన మంత్రి



కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 3: విజయవాడలో సంభవించిన వరదల నుంచి ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని మంత్రి టీజీ భరత్ అన్నారు. మంగళవారం వరద బాధితులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధికి టీజీవీ గ్రూప్స్ నుంచి రూ.10 లక్షల విరాళం అందజేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఇలాంటి సంక్షోభ పరిస్థితుల్లో చిన్నా పెద్ద తేడా లేకుండా ఎలాంటి సహాయమైనా గణనీయమైన ప్రభావాన్ని చూపుతుందని మంత్రి పేర్కొన్నారు. వరదల నుంచి రాష్ట్రాన్ని అదుకునేందుకు ప్రతి ఒక్కరూ ఉదారంగా సహకరించాలని ఆయన కోరారు.

తుంగభద్రలో 101.15 టీఎంసీలు

● ప్రమాద హెచ్చరికను జారీ చేసిన టీబీపీ బోర్డు



నిండు కుండలా దర్శనమిస్తున్న తుంగభద్ర జలాశయం

కర్నూలు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం వంద టీఎంసీలకు చేరింది. మంగళవారం రాత్రి 9 గంటలకు జలాశయంలోకి 47,911 క్యూసెక్కుల మేర వరద వచ్చి చేరింది. డ్యాం గరిష్ఠ నీటి మట్టం 1,633 అడుగులు, సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా.. 1,631.75 అడుగుల లెవల్‌లో 101.15 టీఎంసీల నీటి నిల్వ ఉంది. కాలువకు 15,361 క్యూసెక్కులు తాగు నీరు, సాగునీటి కోసం విడుదల చేస్తున్నారు. బుధవారం ఉదయం 9 గంటల సమయానికి 50 వేల క్యూసెక్కులు దాటే అవకాశం ఉంది. దీంతో గేట్లెత్తి దిగువ శ్రీశైలం జలాశయానికి నీటిని విడుదల చేసేందుకు బోర్డు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో నదితీర గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.

విజయవాడకు 12 బృందాలు

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 3: విజయవాడ పరిసర ప్రాంతాల్లో వరద సహాయక చర్యలు చేపట్టేందుకు జిల్లా నుంచి 12 బృందాలను పంపినట్లు కలెక్టర్ పి. రంజిత్ బాషా తెలిపారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ సహాయక బృందాలను పంపుతున్నట్లు ఆయన మంగళవారం వెల్లడించారు. ఒక్కో బృందంలో ఎనిమిది మంది సభ్యులు ఉంటారని, ఎలక్ట్రీషియన్, ప్లంబర్‌తోపాటు పారిశుధ్య కార్మికులు ఉంటారన్నారు. కర్నూలు డివిజన్‌లో కోడుమూరు నుంచి రెండు బృందాలు, గొందిపర్ల నుంచి ఒకటి, ఆలూరు, మద్దికెర నుంచి ఒక్కో బృందం, పత్తికొండ నుంచి రెండు బృందాలు బయలుదేరాయని తెలిపారు. ఆదోని డివిజన్ నుంచి ఆదోని, కోసిగి, గోనెగండ్ల, మంత్రాలయం, హొళగుంద నుంచి ఒక్కో బృందం ఉన్నాయని ఆయన వెల్లడించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో త్వరితగతిన పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టేందుకు ఈ బృందాలు సహాయపడుతాయని తెలిపారు.

తుంగభద్రతపై దృష్టి



తుంగభద్ర డ్యాం భద్రతపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) దృష్టి సారించింది. టీబీపీ బోర్డు సూచన మేరకు క్షేత్రస్థాయిలో అధ్యయనం (స్టడీ) చేయడంతో పాటు క్రస్ట్‌గేట్ల భద్రత, డ్యాం నీటి నిల్వ, స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్.. వంటి అంశాలపై నివేదిక ఇవ్వాలని ఆ కమిటీకి మార్గదర్శకాలు నిర్దేశించారు. ఆగస్టు 10న డ్యాం 19న నంబరు క్రస్ట్‌గేట్ చైన్‌లింక్ తెగిపోయి కొట్టుకపోయిన విషయం తెలిసిందే. క్రస్ట్‌గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు సారథ్యంలో స్టాప్‌గేట్ల ఎలిమెంట్ సెగ్మెంట్లు దిగ్విజయంగా అమర్చి దాదాపు 30 టీఎంసీలు కాపాడారు. తాత్కాలికంగా ఉపశమనం లభించినా.. మిగిలిన 32 క్రస్ట్‌గేట్ల ఎంత వరకు భద్రం..? అన్న ప్రశ్నలు వెల్లువెత్తాయి. దీనిపై 'తుంగ'భద్ర'మేనా..? శీర్షికన ఆంధ్రజ్యోతి ప్రచురించింది. స్పందించిన తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు అధికారులు ఎక్స్‌పర్ట్ కమిటీ ఏర్పాటు చేయాలని ఎన్‌డీఎస్‌ఏను కోరారు. సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ ఏకే బజాజ్ నేతృత్వంలో ఆరుగురు సభ్యులు నిపుణుల కమిటీని నియమించారు. ఈ కమిటీని 15 రోజుల్లోగా అధ్యయన నివేదికను సీడబ్ల్యూసీ, టీబీపీ బోర్డుకు అందజేయాల్సి ఉంటుంది.

- అధ్యయనానికి ఆరుగురు సభ్యులతో కమిటీ
- చైర్మన్‌గా సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ ఏకే బజాజ్
- కమిటీలో ఒకరు ఆదోనివాసి
- 15 రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని స్పష్టమైన ఆదేశాలు

కర్నూలు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల జీవనాడి తుంగభద్ర జలాశయం. మూడు రాష్ట్రాల్లో సుమారు 12.5 లక్షల ఎకరాలకు సాగునీరు, కోటి మందికిపైగా ప్రజలు దాహం తీరుస్తోంది. 2024-25 నీటి సంవత్సరంలో డ్యాంకు ఆశాజనంగా వరద చేరింది. అయితే 19వ నంబరు క్రస్ట్‌గేటు కొట్టుకుపోవడం వల్ల దాదాపు 62.78 టీఎంసీలు సముద్రానికి వదలాల్సి వచ్చింది. సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకోవడం, కర్ణాటక ప్రభుత్వం కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో క్రస్ట్‌గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు నాయకత్వంలో కొట్టుకుపోయిన గేటు స్థానంలో తాత్కాలికంగా స్టాప్‌లాగ్ ఎలిమెంట్ అమర్చారు. సుమారు 30 టీఎంసీలు కడలిపాలుకాకుండా కాపాడారు. మొత్తం గేట్లను మూసివేశారు. అప్పటి నుంచి డ్యాంలోకి రోజూ 25-30వేలకు పైగా టీఎంసీల వరద వచ్చి చేరుతోంది. ఈ క్రమంలో కొట్టుకుపోయిన 19వ గేట్ సహా మిగిలిన 32 క్రస్ట్‌గేట్లు భద్రమేనా..? మళ్లీ గేట్లు ఎత్తితే ఎలాంటి ఇబ్బందులు తలెత్తుతాయి..? వంటి ప్రశ్నలు వెల్లువెత్తాయి. దీనికి ప్రధాన కారణం ఈ ప్రాజెక్టు నిర్మించి 70 ఏళ్లు కావస్తోంది. క్రస్ట్‌గేట్ల జీవిత కాలం 45 ఏళ్లేనని నిపుణుడు ఎన్.కన్నయ్యనాయుడు పదేపదే చెబుతున్నారు. పదేపదే క్రస్ట్‌గేట్లు కొట్టుకుపోతే భవిష్యత్తులో రాయలసీమ రైతులు తీవ్ర సాగునీటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. కర్నూలు, అనంతపురం, కడప జిల్లాల సాగు, తాగునీటి అవసరాలను దృష్ట్యా తుంగభద్రను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కమిటీ సభ్యులు వీరే

తుంగభద్ర డ్యాం క్రస్ట్‌గేట్ల భద్రతపై అధ్యయన నిపుణుల కమిటీ చైర్మన్ ఏకే బాజాజ్‌ను నియమించారు. ఈయన కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ సహా వివిధ హోదాలో సుదీర్ఘకాలంగా పని చేశారు. ఢిల్లీకి చెందిన రిటైర్డ్ మెకానికల్ ఇంజనీర్లు, ఎక్స్‌పర్ట్ హర్కేశ్ కుమార్, కర్నూలు జిల్లా ఆదోని పట్టణానికి చెందిన మెకానికల్ ఎక్స్‌పర్ట్ తారాపురం సుధాకర్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి సీడీవో విభాగం ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు.

● కమిటీ సభ్యుల్లో ఆదోనివాసి సుధాకర్

తుంగభద్ర డ్యాం క్రస్ట్‌గేట్లు భద్రతపై అధ్యయనం కోసం నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ నియమించిన సభ్యుల్లో ఒకరైన తారాపురం సుధాకర్ ఆదోనివాసి. ఈయన స్వగ్రామం పెద్దకడుబూరు మండలం తారాపురం. ఈయన ప్రాథమిక, ఉన్నత విద్యతో పాటు ఇంటర్మీడియట్ బళ్లారి జిల్లా శిరుగుంపలో పూర్తి చేశారు. దావణగేరి ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ బీటెక్ పట్టా అందుకున్నారు. తుంగభద్ర స్టీల్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ కంపెనీ, మల్టీ నేషనల్ కంపెనీల్లో మెకానికల్ ఇంజనీరుగా పని చేసి స్వచ్ఛంద పదవీవిరమణ పొందారు. ఆ తరువాత దేశంలోనే కాకుండా నేపాల్‌లో ప్రాజెక్టుల మెకానికల్ ఎక్స్‌పర్ట్‌గా పని చేశారు. నేపాల్ ప్రభుత్వ సలహాదారుడిగా కూడా పని చేశారు. స్వదేశానికి తిరిగి వచ్చిన ఆయన ప్రాజెక్టుల క్రస్ట్‌గేట్లు, మెకానికల్ డిజైన్‌పై పని చేస్తున్నారు.

ఎక్స్‌పర్ట్ కమిటీ దృష్టి సారించాల్సిన ప్రధాన అంశాలు

- తుంగభద్ర డ్యాం 19వ నంబరు క్రస్ట్‌గేట్ చైన్‌లింక్ తెగిపోవడానికి, ఆ గేటు స్పిల్‌వే గ్రూవ్ (గాడి) నుంచి పూర్తిగా కొట్టుకుపోవడానికి ఖచ్చితమైన సాంకేతిక కారణాలు నిర్ధారించాలి.
- వర్షాకాలం ప్రారంభానికి ముందు, వర్షాకాలం ప్రారంభం తరువాత తనిఖీ చేసిన సమయంలో కొట్టుకుపోయిన క్రస్ట్‌గేట్, చైన్‌లింక్ పనితీరు పరీక్షించి ధ్రువీకరించారో లేదో నిర్ధారించాలి. అలాగే స్పిల్‌వే క్రస్ట్‌గేట్ల జీవితకాలం (వయస్సు), చివరి మరమ్మతులు, తనిఖీ తేదీని అంచనా వేసి నిర్ధారించాలి.
- ఇతర డ్యాంలకు ఉన్నట్లు తుంగభద్ర డ్యాంకు స్టాప్‌లాగ్ గేట్లు లేవు. స్టాప్‌లాగ్ లేకపోవడం వల్ల జరిగే నష్టాన్ని అంచనా వేయాలి. మళ్లీ ఇలాంటి సంఘటనలు జరగకుండా క్రస్ట్‌గేట్ల బలోపేతం కోసం తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేయాలి.
- మిగిలిన 32 క్రస్ట్‌గేట్ల ప్రస్తుత పరిస్థితిని అధ్యయనం చేసి వాటి భద్రతకు తీసుకోవాల్సిన చర్యలు, ఏ లెవల్‌లో నీటిని నిల్వ చేయాలో స్పష్టమైన సూచనలు (సిఫార్సు) చేయాలి.



తుంగభద్ర జలాశయం

చిన్నమర్రివీడులో డెంగీ

నివారణ చర్యలు చేపట్టిన వైద్యశాఖ

గోనెగండ్ల, సెప్టెంబరు 3: గోనెగండ్ల మండల పరిధిలోని చిన్నమర్రివీడు గ్రామంలో 46 ఏళ్ల మహిళకు డెంగీ వ్యాధి సోకినట్లు జిల్లా మలేరియా అధికారి నూకరాజు తెలిపారు. స్థానిక వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది నివారణ చర్యలు చేపట్టారు. జిల్లా మలేరియా అధికారి నూకరాజు గ్రామాన్ని సందర్శించి రోగి ఇంటి పరిసరాలలో పిచికారి చేయించి, ఈగలు, దోమలు పెరగకుండా ఉండేందుకు చర్యలు తీసుకున్నారు. ఎవరికైనా జ్వరం ఇతరత్రా అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా, ఈవోపీఆర్‌డీ నాగేష్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు

నేడు జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 3: జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు బుధవారం నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్‌లోని మినీ సమావేశ భవనంలో ఏడు స్థాయి సంఘ సమావేశాలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారని తెలిపారు. ఉదయం 10 గంటల నుండి 10.30 గంటల వరకు 2వ స్థాయి సంఘం, 10.30 నుండి 11.00 గంటల వరకు 3వ స్థాయి సంఘం, 11.00 గంటల నుండి 11.30 గంటల వరకు 6వ స్థాయి సంఘం, మధ్యాహ్నం 11.30 నుంచి 12.00 గంటల వరకు 4వస్థాయి సంఘం, 12.00 నుంచి 12.30 వరకు 5వ స్థాయి సంఘం, 12.30 నుంచి 1.30 వరకు 1, 7వ స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు సీఈఓ పేర్కొన్నారు.

పంట వివరాలను నమోదు చేసుకోవాలి

వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి



సాగు చేసిన పత్తి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి

గూడూరు సెప్టెంబరు 3: రైతులు సాగు చేసిన పంటల వివరాలను తప్పనిసరిగా ఈ-పంటలో నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని గుడిపాడు గ్రామంలో మండల వ్యవసాయాధికారి శ్రీవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి కర్నూలు సబ్ డివిజన్ ఇన్‌చార్జి ఏడీఏ దస్తగిరిరెడ్డి గ్రామంలో రైతులు సాగు చేసిన పంట పొలాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా జేడీ వరలక్ష్మి మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంట వివరాలు తప్పనిసరిగా ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. అలాగే వీఏఏ గిరి మోహన్ రెడ్డిని పంట నమోదు, రైతుల ఈకేవైసీని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం గూడూరు పట్టణంలోని అగ్రి ల్యాబ్‌ను సందర్శించి అందులో పరీక్ష వివరాలను, వాటి ఫలితాలను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో అగ్రి ల్యాబ్ ఏవో విజయకుమార్, ఏఈవోలు లక్ష్మీనారాయణ, శ్రీవాణి, వేణుగోపాల్, రాణి తదితరులు ఉన్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు

- రూ.4.48 లక్షలు స్వాధీనం
- బైక్, కటింగ్ బ్లేడ్లు, స్పానర్లు స్వాధీనం



దొంగతనం వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ

డోన్(రూరల్), సెప్టెంబరు 3: పట్టణ సమీపంలోని రుద్రాక్షగుట్ట ప్రధాన రోడ్డులో డోన్ పోలీసులు ఇద్దరు దొంగలను అరెస్టు చేశారు. మంగళవారం సాయంత్రం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఇంతియాజ్‌బాషా, పట్టణ ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డిలతో కలిసి డీఎస్పీ పి. శ్రీనివాసులు విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. కర్నూలు ఉమ్మడి జిల్లాలో పలు ప్రాంతాల్లో కోడుమూరు చెందిన ఉప్పరి శేఖర్, మేకల గిడ్డయ్య రైతుల పంట పొలాల్లో ట్రాన్స్‌కో ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి వాటిలోని రాగితీగలను దొంగలించేవారని అన్నారు. వీరిపై గతంలో 45 కేసులు నమోదై ఉన్నాయని తెలిపారు. వీరిని అరెస్టు చేసి, రూ.4,48,500 నగదును 150 కిలోల రాగితీగలను, మోటారు బైక్‌ను, దొంగతనాలకు ఉపయోగించే కటింగ్ బ్లేడ్లు, స్పానర్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను కోర్టులో హాజరు పరుస్తున్నట్లు డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు.

ఆళ్లగడ్డలో నలుగురు జూదరుల అరెస్టు

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 3: ఆళ్లగడ్డ పట్టణంలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్ఐ నగీనా మంగళవారం చెప్పారు. పట్టణంలోని చిన్నకందుకూరు రోడ్డు వద్ద ఉన్న జగత్ మిల్క్‌డైరీ సమీపంలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1.80 లక్షలు, 52 పేకముక్కలు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పెద్దాసుపత్రిలో మందులపై ప్రత్యేక దృష్టి

సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి



మాట్లాడుతున్న సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 3: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మందుల స్టాక్‌పై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ధన్వంతరి హాలులో హెడ్ నర్సులు, వార్డు ఇన్‌చార్జి హెడ్‌లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రతి రోజూ మందులకు ఎంత ఇండెంట్ పెడుతున్నారు.. రోగులకు సంబంధించిన ఇన్వెస్టిగేషన్, ఎన్టీఆర్ వైద్యసేవ కేసుల విషయాలపై సూపరింటెండెంట్ చర్చించారు. ఎన్టీఆర్ వైద్యసేవ కింద సరఫరా అవుతున్న కిట్లపై ఆయన ఆరా తీశారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలకు సంబంధించి డ్రగ్స్ స్టోర్ రిజిస్టర్‌ను రెగ్యులర్‌గా మెయింటెన్ చేయాలని వార్డు ఇన్‌చార్జి హెడ్‌లను ఆదేశించారు. ఆసుపత్రిలో అన్ని విభాగా లకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్‌పై త్వరలో తనిఖీ చేస్తామన్నారు. సమీక్షలో సీఎస్ఆర్ఎంవో డా.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డా.బి.హేమనళిని, ఏఆర్ఎంవో డా.వెంకటరమణ, స్టోర్ మెడికల్ ఆఫీసర్ శారద, నర్సింగ్ సూపరింటెండెంట్ ఎస్పీ సావిత్రీబాయి, ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ చిరంజీవి పాల్గొన్నారు.

నాగసాయి ఆశ్రమాన్ని సందర్శించిన శ్రీశైలం పీఠాధిపతి



ఆశీర్వచనం చేస్తున్న శ్రీశైలం పీఠాధిపతి

పాములపాడు, సెప్టెంబరు 3: మండలంలోని జూటూరు గ్రామ శివార్లలోని శ్రీ నాగసాయి విద్య బ్రహ్మ ఆశ్రయాన్ని శ్రీశైలం పీఠాధిపతి డాక్టర్ చెన్నసిద్ధ పండితారాధ్య శివాచార్య మహాస్వామి సందర్శించారు. ఆశ్రమ పీఠాధిపతి శ్రీ రామనందాస్వామి వారు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు.

యువకుడి ఆత్మహత్య

కర్నూలు, సెప్టెంబరు 3: మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవనగర్‌లో వెంకటేశ్ (23) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతపురం జిల్లా యాడికి మండలం రాయలచెరువు గ్రామానికి చెందిన వెంకటేశ్ ఏడాది కింద కర్నూలు వచ్చి దేవనగర్‌లో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని నివాసముంటున్నాడు. ఆర్ఆర్‌బీ పరీక్షలకు సిద్ధమవుతూ.. వాహనాలకు జీపీఎస్ సిస్టమ్ అమర్చే పని చేస్తున్నాడు. ఈ నెల 1వ తేదీ తల్లిదండ్రులతో మాట్లాడిన వెంకటేశ్ 2వ తేదీ నుంచి ఫోన్ లిఫ్టు చేయడం లేదు. దీంతో తల్లిదండ్రులు కర్నూలులోని బంధువులకు సమాచారం ఇవ్వగా.. వారు వెంకటేశ్ గదికి వెళ్లి పరిశీలించారు. గదిలో వెంకటేష్ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. వెంటనే తలుపులు పగులకొట్టి వెంకటేశ్‌ను కిందకు దించి ఆసుపత్రికి తరలించాడు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మురళిధర్ రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి

శరీరమంతా ఛిద్రం

కర్నూలు, సెప్టెంబరు 3: నగరంలోని డోన్ రహదారిలో ఉన్న శ్రీచక్ర హాస్పిటల్ సమీపంలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. సోమవారం అర్ధరాత్రి తర్వాత ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు తెలిపారు. ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. జాతీయ రహదారిపై ఎలాంటి ఆనవాళ్లు కనిపించకుండా శరీరం ఛిద్రమైపోయింది. చీర, లంగా మాత్రమే రోడ్డుపై పడి ఉంది. దొరికిన దుస్తుల ఆధారంగా యాచకురాలై ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం సమీపంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

సంజామల, సెప్టెంబరు 3: పేరుసోమల, రెడ్డిపల్లె మార్గమధ్యంలో మంగళవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. మృతుడు పేరుసోమల గ్రామానికి చెందిన గుల్లకుంట్ల బాల ఓబన్న ఉరఫ్ నరేష్ (35)గా గుర్తించారు. బాల ఓబన్న గ్రామంలోని పెట్రోల్ బంకులో పంపు బాయ్‌గా పనిచేసేవాడు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు పని ఉందంటూ భార్యకు చెప్పి స్కూటీపై నరేష్ బయటికి వెళ్లాడు. తిరిగి పొద్దున వరకు కనపడలేదు. రెడ్డిపల్లె గ్రామానికి చెందిన లక్ష్మీరెడ్డి అనే రైతు నరేష్ మృతదేహాన్ని చూసి పేరుసోమల గ్రామంలోని నరేష్ బంధువులకు సమాచారం అందించారు. వారు మృతుడి భార్యకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి వెళ్లారు. నరేష్ స్కూటీపై నుండి కింద పడి మృతి చెంది కనిపించాడు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య క్రిష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ రమణయ్య తెలిపారు.

ఉపాధి అవకాశాలను వినియోగించుకోండి

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 3: నిరుద్యోగులు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. మంగళవారం నగరంలోని బిర్లా కాంపౌండ్‌లోని ఎస్‌ఏసీ శిక్షణా కేంద్రంలో జరిగిన జాబ్ మేళాకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాలకు ఆకర్షితులైన ప్రముఖ కంపెనీలు తరలి వచ్చి ఇంటర్వ్యూలు నిర్వహించడం హర్షించదగిన్న విషయమన్నారు. ఆలూరు, పాణ్యం నియోజకవర్గంలో నిర్వహించిన జాబ్ మేళాకు 647 మంది నిరుద్యోగ యువతీ, యువకులు తరలిరావడం అందులో 244 మంది ఎంపిక కావడం మంచి పరిణామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్ సలీం బాషా, ఉపాధి కల్పనాధికారి దీప్తి, ఎస్‌ఏసీ డైరెక్టర్ సంతోష్, సాయితేజ, ప్రిన్సిపాల్ రమాదేవీ, శిక్షణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చిరుత దాడిలో మేక మృతి

కోసిగి, సెప్టెంబరు 3: చిరుత దాడిలో మేక మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో జరిగింది. గ్రామంలోని మేకల మందపై చిరుత పులి మంగళవారం తెల్లవారు జామున దాడి చేసింది. కుక్కలు గట్టిగా అరుస్తూ వెంట పడటంతో ఆ మేకను అక్కడే వదిలేసి వెళ్లింది. అప్పటికే మేక మృతి చెందినట్లు రైతు హనుమంతు తెలిపారు. చిరుత పులిల వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని, ఫారెస్టు అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని హనుమంతు కోరారు.

యూరియా నీటిని తాపడంతో కాడెద్దుల మృతి

మిడుతూరు, సెప్టెంబరు 3 : యూరియా, డీఏపీ ఎరువులు కలిసిన నీటిని తాగి కాడెద్దులు మృతి చెందాయి. కడుమూరు గ్రామానికి చెందిన రామచంద్రుడు మంగళవారం తన ఎద్దుల పాకలో పొగాకు నారుమళ్ల కోసం యూరియా డీఏపీ ఎరువులను నీటిలో కలిపి ఉంచాడు. పొరపాటున ఎరువులు కలిపిన నీటిని దాన కలిపిన నీరు అనుకుని తన రెండు ఎద్దులకు తాపాడు. కొద్ది సేపటికి ఎద్దులు కొట్టు మిట్టాడుతుండం గమనించిన రైతు వెంటనే పశువైద్య అధికారి చంద్రమోహన్‌కు తెలిపాడు. డాక్టరు వెంటనే స్పందించి సంచార వాహనం ద్వారా సంఘటనా స్థలానికి చేరుకుని ఎద్దులకు వైద్యం అందించినా ఫలితం లేకపోయింది. లక్ష రూపాయల విలువగల కాడెద్దులు మృతి చెందడంతో రైతు కుటుంబ సభ్యులు రోదించారు.

వెయిట్ లిఫ్టర్లకు కలెక్టర్ అభినందన



అభినందనలు తెలుపుతున్న కలెక్టర్

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 3: రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో చాంపియన్ షిప్ సాధించిన జిల్లా వెయిట్ లిఫ్టర్లను మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ పి.రంజిత్‌బాషా అభినందించారు. గత ఆగస్టు 30, సెప్టెంబరు 1న అనకాపల్లిలో నిర్వహించిన 11వ యూత్ జూనియర్, సీనియర్స్ బాలుర బాలికల చాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారు. 55 కేజీల విభాగంలో డి.జి.వీరేష్, జూనియర్‌లో సిల్వర్ మెడల్, సీనియర్లు సిల్వర్ మెడల్స్, 61 కేజీల విభాగంలో బి.వీరేష్ జూనియర్ విభాగంలో గోల్డ్ మెడల్, సీనియర్ బ్రాంజ్, అలాగే 61 కేజీల విభాగంలో ఎస్.అబ్దుల్లా సిల్వర్, 81 కేజీల విభాగంలో అబ్దుల్ హక్ బ్రాంజ్, 89 కేజీల విభాగంలో నరసింహ నాయక్ జూనియర్, సీనియర్‌లలో బ్రాంజ్, 109 కేజీల విభాగంలో ఎస్.ముస్రాఫ్ పర్వేజ్ జూనియర్ సిల్వర్ సినియర్లు బ్రాన్జ్ మెడల్స్ సాధించారు. అలాగే 109 కేజీల విభాగంలో బి. వెంకట్రాముడు మెడల్ సాధించారు.

నిందితుడికి రిమాండు

పోక్సోయాక్ట్ కింద కేసు నమోదు

అవుకు, సెప్టెంబరు 3 : అవుకు మండలంలో బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన వైసీపీ కార్యకర్త మోహరి ప్రభుదాసుపై పోక్సో కింద కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ రాజారెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అవుకు మండలంలోని గ్రామానికి చెందిన ప్రభుదాసు ఈనెల 1వతేదీన ఓ బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. నిందితుడ్ని అరెస్టు చేసి ఆళ్లగడ్డ సబ్‌జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

కూలిన మట్టి మిద్దె

నందికొట్కూరు, సెప్టెంబరు 3: ఎడతెగని వర్షాలకు నందికొట్కూరు పట్టణంలో మంగళవారం ఓ మట్టి మిద్దె కూలింది. మొక్కజొన్నల వ్యాపారంలో ఏజెంటుగా పని చేస్తున్న కె మురళి పట్టణంలోని 10వ వార్డు రవీంద్రభారతి స్కూల్ సమీపంలో మట్టి మిద్దెలో నివసిస్తున్నాడు. వానలకు తడిసి మిద్దె కూలడంతో రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని మురళి తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

బండిఆత్మకూరు, సెప్టెంబరు 3: మండలంలోని జీసీ పాలేనికి చెందిన రామలక్ష్మి (32) విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపారు. రామలక్ష్మి మంగళవారం ఉదయం ఇంట్లో వంట చేసుకుని, ఇద్దరు పిల్లలను బడికి పంపించింది. అనంతరం ఇంటి గోడ పక్కన ఉంచిన మంచాన్ని ఆనుకుని కాఫీ తాగుతుండగా అక్కడే ఉన్న కరెంట్ తీగ తగిలి గిలగిల కొట్టుకుంటూ ఉండగా ఎదురింటి ఆదిలక్ష్మి వచ్చి లాగబోయింది. ఆమె కూడా విద్యుత్ షాక్‌కు లోనవ్వటంతో రామలక్ష్మి భర్త స్వాములు కర్ర సహాయంతో విద్యుత్ తీగను తొలగించాడు. అప్పటికే రామలక్ష్మి మృతి చెందింది. ఆదిలక్ష్మికి ప్రమాదం తప్పింది. స్వాములు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అగ్నిప్రమాదానికి 85 గొర్రెలు మృతి

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 3: ఆళ్లగడ్డ పట్టణంలోని బృందావన్ కాలనీ సమీపంలో సోమవారం రాత్రి పొద్దుపోయాక జరిగిన అగ్నిప్రమాదానికి 85 గొర్రెలు మృతి చెందాయి. దీంతో యజమాని క్రిష్ణయ్యకు సుమారు రూ.10 లక్షలు నష్టం వాటిల్లింది. గుడిసెలో ఉన్న గొర్రెలను దోమలు కుట్టకుండా వేసిన పొగ వల్ల గుడిసె అంటుకొని ఈ ప్రమాదం జరిగింది. సంఘటనా స్థలాన్ని ఆళ్లగడ్డ తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి, పశువైద్యాధికారి వరప్రసాద్, లైఫ్‌టాక్స్ అసిస్టెంటు సద్దాం హుసేన్ మంగళవారం సందర్శించి మృతి చెందిన గొర్రెలను పరిశీలించారు.

ఉర్దూ వర్సిటీలో వెబ్ కౌన్సెలింగ్‌కు దరఖాస్తులు

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 3: డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి వెబ్ కౌన్సెలింగ్‌కు దరఖాస్తులు చేసుకోవాలని రిజిస్ట్రార్, ప్రొఫెసర్ వి. లోక్‌నాథ్ తెలిపారు. 2024 ఏపీ ఐసెట్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు యూనివర్సిటీలో కోర్సుల ప్రవేశానికి అర్హులన్నారు. వెబ్‌సైట్‌లో ఈనెల 9 నుంచి 14 వరకు వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకోవాలని, ఆప్షన్స్‌లో ఏహెచ్‌యూయూను ఎంపిక చేసుకోవాలని, 17న సీట్ల కేటాయింపు, 17 నుంచి 21 వరకు యూనివర్సిటీ కళాశాలలో విద్యార్థులు రిపోర్టు చేయాల్సి ఉంటుందన్నారు.

ఉద్యాన పంటల నష్టం రూ.14 లక్షలు

ఉద్యానశాఖాధికారి నాగరాజు

నంద్యాల రూరల్, సెప్టెంబరు3; వర్షం కారణంగా నంద్యాల జిల్లాలో ప్రధానంగా ఐదు మండలాలలో ప్రాథమిక అంచనా మేరకు సుమారు 81 హెక్టార్లలో రూ14 లక్షలకు పైగా ఉద్యానవన పంటనష్టం జరిగిందని జిల్లా ఉద్యానశాఖాధికారి నాగరాజు తెలిపారు. ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం ఇటీవల నాలుగు రోజులనుండి ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా జరిగిన ఉద్యాన పంటల నష్టం అంచనాపై సిబ్బందిలో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1.10 లక్షల ఎకరాలలో ఉద్యాన పంటలను రైతులు సాగు చేశారన్నారు. వర్షాలకు మిడుతూరు, నందికొట్కూరు, ఆత్మకూరు, పాములపాడు, కోవెలకుంట్ల మండలాలలోని 88 మంది రైతులకు చెందిన మిరప 28.05, ఉల్లి 35, మునగ 0.5, టమోటా 2, తమలపాకుల తోటలు 10, కాకర 5 హెక్టార్లలో పంటలు నష్టపోయినట్లు గుర్తించామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పూర్తి స్థాయిలో నష్టపోయిన రైతులకు సాయం అందేందుకు కృషి చేస్తామన్నారు.

ఇష్టపడి చదవాలి: ఎమ్మెల్యే



విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న గౌరు చరిత

ఓర్వకల్లు, సెప్టెంబరు 3: విద్యార్థులు ఇష్టపడి చదివితే.. ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని నన్నూరు గ్రామ బంగ్లా కాలనీలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎమ్మెల్యే గౌరు చరిత ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. అలాగే మండల ప్రజాపరిషత్ ఉన్నత స్పెషల్ పాఠశాలలో మొక్కలను నాటారు. ఈసందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాల న్నారు. కార్యక్రమంలో ఎంఈవో ఓంకార్ యాదవ్, ఎస్ఐ సునీల్ కుమార్, హెచ్ఎం నారాయణ, యూటీఎఫ్ నాయకులు ఇస్మాయిల్, నాయకులు విశ్వేశ్వరరెడ్డి, ఖాజామియా, విజయుడు, షంషుద్దీన్, వడ్ల బాషా, సర్కార్, మోహన్, పాపారాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం



నిత్యావసర సరుకుల వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 3: విజయవాడ వరద బాధితులకు కర్నూలు కల్కి సేవా సమితి సాయం అందించడం అభినందించ దగ్గ విషయమని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. మంగళవారం నగరం నుంచి విజయవాడకు తరలిస్తున్న వాటర్ బాటిళ్లు, తినుబండారాలు, నిత్యావసర వస్తువులు, దుప్పట్లను తరలిస్తున్న వాహనాలను ఎంపీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి సాయం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కల్కి మురళి, మోక్షేశ్వరుడు, పాల్గొన్నారు.

బాలన్న మృతి పార్టీకి తీరని లోటు

ఓర్వకల్లు, సెప్టెంబరు 3: మండలంలోని హుశేనాపురం గ్రామానికి చెందిన వడ్డె బాలన్న మృతి టీడీపీకి తీరని లోటని నందికొట్కూరు పార్టీ ఇన్చార్జి గౌరు వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం టీడీపీ కార్యకర్త వడ్డె బాలన్న గుండెపోటుతో మృతి చెందడంతో ఈ విష యం తెలిసిన వెంటనే గౌరు వెంకటరెడ్డితోపాటు నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, నాయకులు పెరుగు పురుషోత్తంరెడ్డి, బైరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి బాలన్న భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, నాయకులు మహబూబ్‌బాషా, గొల్ల నాగరాజు, జయకృష్ణ, వడ్డె రవికుమార్ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో రెండు కేసులు నమోదు

కర్నూలు, సెప్టెంబరు 3: నగరంలో ట్రాఫిక్ పోలీసులు మంగళవారం రాత్రి రెండు డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. సుంకేసుల రోడ్డులోని సంజీవని హాస్పిటల్ దగ్గర ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేశారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఇద్దరు ద్విచక్ర వాహనదారులపై కేసులు నమోదు చేశారు. వాహనాలను స్వాధీనం చేసుకుని వీరిని కోర్టులో హాజరుపస్తామని సీఐ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, సెప్టెంబరు 3: విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా బి.క్యాంప్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు డివిజన్ ఈఈ శేషాద్రి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు కరెంట్ కోత ఉంటుందని ఏడీఈ రాజేంద్రబాబు తెలిపారు. సి.క్యాంప్, గణేష్‌నగర్, శ్రీరామ్‌నగర్, విజయ హాస్పిటల్ ఏరియాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గుర్తించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

సి.బెళగల్, సెప్టెంబరు 3: సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సి.బెళగల్ పీహెచ్‌సీ వైద్యాధికారి మిథున్‌కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని వైద్య సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాల న్నారు.

స్థల పరిశీలన: సి.బెళగల్ మండలం పోలకల్లు గ్రామంలో చెత్త సేకరణ సంపద కేంద్రాన్ని నిర్మించడానికి తహసీల్దార్ విజ యశ్రీ స్థలాన్ని పరిశీలించారు. ఆమె వెంట అధికారులు, సర్వేయర్ ఉన్నారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడండి: టీడీపీ

సి.బెళగల్, సెప్టెంబరు 3: మండల కేంద్రంలో ఉన్న కొండ పోరంబోకు భూములను కాపాడాలని టీడీపీ మాజీ ఎంపీటీసీ ధనుంజయుడు, విష్ణుసేన యూనియన్ నాయకుడు భీమన్న, గఫూర్, బాలాజి వెంకటేశ్, గఫూర్, రాజు అన్నారు. ఈ మేరకు వారు మంగళవారం తహసీల్దార్‌కు విన్నతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయశ్రీ మాట్లాడుతూ మండల కేంద్రంలో ఉన్న 355, 426 గల సర్వేర్ నంబరు గ్రామస్థులు ఇష్టం వచ్చినట్లు కొండ పోరంబోకు భూముల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్నారని, వారందరికీ నోటీసులు జారీ చేసి అనంతరం ఖాళీ చేయకుంటే కూలగొడతామన్నారు.

11న హ్యాండ్‌బాల్ పోటీలు

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 3: అంతర్ పాఠశాలల హ్యాండ్ బాల్ పోటీలు ఈనెల 11న స్టేడియంలో జరుగుతాయని హ్యాండ్ బాల్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే ఈనెల 6న జరగాల్సిన ఈ పోటీలు విద్యార్థుల పరీక్షల కారణంగా వాయిదా పడ్డాయన్నారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు



ప్రభుత్వ స్థలాలను పరిశీలిస్తున్న తహసీల్దార్

సి.బెళగల్, సెప్టెంబరు 3: అనుమతి లేకుండా ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ విజయశ్రీ తిమ్మనదొడ్డి గ్రామస్థులను హెచ్చరించారు. మంగళవారం మండలంలోని తిమ్మనదొడ్డి, సంగాల, పలుకుదొడ్డి గ్రామాల్లోని ప్రభుత్వ స్థలాలను తహసీల్దార్ పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఆయా గ్రామాలలో ప్రభుత్వం భవన నిర్మాణాల కోసం కేటాయించిన స్థలాల్లో గ్రామస్థులు విచ్చలవిడిగా గుడిసెలు, గృహాలను నిర్మిస్తే కూలగొడతామన్నారు. తహసీల్దార్ వెంట ఈవోఆర్డీ సందీప్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి, సర్వేయర్ నాగభూషణం, వీఆర్వోలు ఉన్నారు.

చెత్త సంపద కేంద్రాలకు స్థలం గుర్తించండి

» హౌసింగ్ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి
» లబ్ధిదారులకు సూచించిన తహసీల్దారు, ఎంపీడీఓ

కల్లూరు, సెప్టెంబరు 3: కల్లూరు మండలంలోని బొల్లవరం, కే. మార్కాపురం, సల్కాపురం గ్రామాల్లో చెత్తసంపద కేంద్రాల నిర్మాణాలకు స్థలం గుర్తించండని వీఆర్వోలను కల్లూరు తహసీల్దారు కె.ఆంజనేయులు ఆదేశించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈమేరకు ఎంపీడీఓ ఆ మూడు గ్రామాల్లో చెత్తసంపద కేంద్రాలు లేవని, స్థలం కేటాయిస్తే ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో త్వరితగతిన చెత్తసంపద కేంద్రాల నిర్మాణాలు పూర్తిచేస్తామని అన్నారు.

● **ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి:** పెద్దటేకూరు హౌసింగ్ లేఅవుట్‌లోని లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. మంగళవారం పెద్దటేకూరు గ్రామంలో పర్యటించిన ఆయన లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రవికిషోర్, సెక్రటరీ మాధవి, వర్క్ ఇన్‌స్పెక్టర్ పుల్లయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దారు ఆంజనేయులు

● అక్టోబరు 2లోపు చెత్తసంపద కేంద్రాలు వినియోగంలోకి తేవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి సెక్రటరీలను ఆదేశించారు. మంగళవారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన పంచాయతీ సెక్రటరీల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈమేరకు గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని, డ్రైనేజీల్లో పూడిక తొలగించాలని, గ్రామాల్లోని ఖాళీ ప్రదేశాల్లో మురుగునీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.

పెట్రోల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలి: సీపీఐ

కర్నూలు(రూరల్), సెప్టెంబరు 3: పెట్రోల్, డీజిల్, గ్యాస్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకరావాలని సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు కర్నూలు అర్బన్ తహసీల్దార్ కార్యలయం ఎదుట మంగళవారం సీపీఐ నగర కార్యవర్గ సభ్యురాలు గిడ్డమ్మ అధ్యక్షతన ధర్నా చేశారు. ముఖ్యఅతిథిగా రామకృష్ణారెడ్డి హాజరై ప్రసంగించారు. దేశంలో అన్ని రకాల వస్తువులను జీఎస్టీ పరిధిలోకి తీసుకొచ్చి పెట్రోల్, డీజిల్, గ్యాస్‌లను ఎందుకు చేర్చడం లేదని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అనంతరం తహసీల్దార్ రామాంజనమ్మకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయ కులు చంద్రశేఖర్, శ్రీరాములుగౌడ్, తిమ్మయ్య, శ్రీనివాసరావు, మహే ష్, నాగరాజు, అన్వర్, నల్లన్న, బీసన్న, ఈశ్వర్, శ్రీనివాసులు, శరత్ కుమార్ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ప్రైవేటు సంస్థలకు అప్పగించొద్దు



మాట్లాడుతున్న పీఎస్ రాధాక్రిష్ణ

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 3: రవాణా శాఖలో డ్రైవింగ్ టెస్టు, వాహనాల ఫిటెనెస్ మొదలైన వాటిని ప్రైవేటు సంసలకు అప్పజెప్పే విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాక్రిష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం కేకే భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మోటార్ యాక్ట్ సవరణ బిల్లులో భాగంగా వాహనాలు రిజిస్ట్రేషన్లు, ఫిటెనెస్ సర్టిఫికెట్లు ప్రైవేటు సంస్థలకు అప్పగించే విధంగా ఉందన్నారు. ఆటోమేటిక్ టెస్టింగ్ ట్రాక్ సిస్టం ద్వారా వాహనాల ఫిట్నెస్ సర్టిఫికెట్లు, రిజిస్ట్రేషన్లు, డ్రైవింగ్ లైసెన్సులు జారీ చేసే విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.ప్రభాకర, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, బి.రాధా క్రిష్ణ, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు సంక్షేమానికి రక్షణ చట్టం తీసుకురండి: జగన్నాథం

కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 3: కౌలు రైతు సంక్షేమానికి ఇప్పటికైనా ప్రభుత్వం రక్షణ చట్టం తీసుకురావాలని, లేకపోతే ఆత్మహత్యలు ఇంకా పెరుగుతాయని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా వ్యవసాయా శాఖ అధికారి వరలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌలు రైతులకు గ్రామసభల్లోనే గుర్తించి భూ యజమానికి సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు.

వక్ఫ్‌బోర్డు చట్ట సవరణపై హర్షం



మాట్లాడుతున్న వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 3: అనేక లోపాలతో ఉన్న వక్ఫ్‌బోర్డు చట్టాన్ని సవరించడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధం కావడం హర్షణీయమని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని కేసీ కెనాల్ ఘాట్ వద్ద గల వినాయక మందిరం సమావేశ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నందిరెడ్డి సాయి రెడ్డి మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు చట్టం లోపాల వల్ల దేశంలోని అనేక ఇతర మతస్థుల, ఆలయాల భూములు ఆక్రమించి, వక్ఫ్ బోర్డు భూములుగా మార్చివేశారని అన్నారు.

కంటి జబ్బులను ప్రాథమిక దశలోనే గుర్తించాలి



కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న డాక్టర్లు శంకర్‌శర్మ, సుధాకర్‌రావు

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 3: కంటి జబ్బులను ప్రాథమిక దశలో గుర్తించాలని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకర్‌శర్మ అన్నారు. నగరంలోని రోజావీధిలో సుశీల నేత్రాలయ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ పి.సుధాకర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం డాక్టరు శంకర్‌శర్మ, సుధాకర్‌రావు కంటి అద్దాలను పంపిణీ చేశారు. డాక్టర్ శంకర్‌శర్మ మాట్లాడుతూ ప్రజలు కంటి సమస్యలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వైద్యం చేయిం చుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు రామస్వామి, మీసాల సుమలత పాల్గొన్నారు.

బాలుడిని కాపాడిన వైద్యులు

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 3: గద్వాల పట్టణానికి చెందిన ఆనంద్, అతని భార్య, ఇద్దరు కుమారులు పొలంలో ఉండగా.. భారీ వర్షం పడింది. దీంతో ఆ కుటుంబం సమీపంలో ఉన్న కొబ్బరి చెట్టు కిందకు వెళ్లారు. సమీపంలో కొంత సేపటికి ఆనంద్ చిన్న కొడుకు మీద పిడుగుపడగా.. వెంటనే కుప్పకూలి పోయాడు. గత నెల 20వ తేదీన వెంటనే కాలిన గాయాలతో కర్నూలు మెడికవర్ హాస్పిటల్‌కు ఎమర్జెన్సీ విభాగానికి తీసుకునివ చ్చారు. బాలుడ్ని ఫిజీషియన్ డా. సరయురెడ్డి తల, ఊపిరితిత్తులకు స్కాన్ చేశారు. పిడుగు వల్ల శరీరం వెనుకభాగం కొద్దిగా కాలినట్లు, కండరాలు కమిలిపోవడం వల్ల రాబ్డోమియోలిసిస్ వస్తుందని డాక్టర్ గుర్తించారు. బాబును వెంటనే పీఐసీయులో అడ్మిట్ చేసి పీడియాట్రిషన్ డా. మురార్జి చికిత్స అందించారు. గత నెల 27వ తేదీ డిశ్చార్జ్ అయ్యారు. ఈ సందర్భంగా హాస్పిటల్ కర్నూలు క్లస్టర్ హెడ్ డా.వై. మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ బాలునికి మెడికవర్ హాస్పిటల్‌లో మెరుగైన వైద్యం అందించారని, మంగళవారం ఆసుపత్రికి వచ్చిన బాలుడు సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నారన్నారు.

రాజధానిగా కర్నూలును ప్రకటించాలి

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 3: ప్రత్యామ్నాయ రాజధానిగా కర్నూలును ప్రకటించాలని రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్వీపీఎస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు అశోక్ అధ్యక్షత సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని ప్రాంతంలో వరదలతో ప్రజలు అల్లాడిపోతున్నారని, గతంలో శ్రీకృష్ణ కమిటీ, శివరామక్రిష్ణన్ కమిటీలు సూచించిన విధంగా మరో ప్రాంతాలో రాజధానిని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో వసంతకుమార్, విజయ్ సురేష్ పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

కోడుమూరు, సెప్టెంబరు 3: పట్టణంలో ఇద్దరి మధ్య జరిగిన గొడవ చివరకు ఘర్షణకు దారి తీసింది. పట్టణం లోని ఎస్సీ కాలనీకి చెందిన గిప్సన్ అనే వ్యక్తిపై రవి అనే వ్యక్తి మంగళవారం దాడి చేసి కొడవలితో కాలిపై నరికాడు. వివరాలిలా ఉన్నాయి. మంత్రి పవన్ కల్యాణ్ పుట్టిన రోజు వేడుకల్లో కేక్ కట్ చేసే విషయంలో గిప్సన్, రవి మధ్య గొడవ జరిగింది. ఇది మనస్సులో పెట్టుకొన్న రవి, గిల్సన్ మరో సారి గొడవకు దిగాడు. ఇద్దరి మధ్య మాట మాట పెరిగడంతో గిల్సన్ కాలిపై కొడవలితో దాడి చేశాడు. ఈ దాడిలో గిల్సన్ కాలికి తీవ్ర గాయమైంది. దీంతో ఎస్ఐ ఏపీ శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొద్దిపాటి వర్షానికే చెరువులను తలపిస్తున్న రోడ్లు

క్రిష్ణానగర్‌లో పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు

కల్లూరు, సెప్టెంబరు 3: నగరంలో కురుస్తున్న వర్షాలకు కాలనీలు చెరువులను తలపిస్తున్నాయి. నెలల తరబడి డ్రైనేజీల్లో పూడిక తొలగించకపోవడంతో కొద్దిపాటి వర్షానికే డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. మంగళవారం సాయంత్రం నగరంలో కురిసిన వర్షానికి క్రిష్ణనగర్ దక్కన్ ధమ్ బిర్యానీ సమీపంలో డ్రైనేజీ కాల్వలు పొంగి మురుగు నీరు కాలనీలోని రోడ్లపై ప్రవహించింది. పాదచారులు, వాహనదారులు మురుగు నీరులో నడవడానికి ఇబ్బందులు పడ్డారు. నగరపాలక సంస్థ అధికారులు డ్రైనేజీ కాల్వల్లో పూడిక తొలగించి కాలనీలపైకి వరదనీరు, మురుగు రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కోట్ల రైల్వేస్టేషన్ సమీపంలోని అండర్‌గ్రౌండ్ బ్రిడ్జి కింద రోజుల తరబడి ఇదేపరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.



దక్కన్ ధమ్ బిర్యానీ సమీపంలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షం నీరు

క్రీడాకారులకు గౌరు దంపతుల అభినందన

కల్లూరు, సెప్టెంబరు 3: ప్రకాశం జిల్లాలో నిర్వహించిన ఇంటర్ స్టేట్ కరాటే చాంపియన్‌షిప్‌లో ప్రతిభ చాటిన కల్లూరుకు చెందిన క్రీడాకారులను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి అభినందించారు. మంగళవారం 33వ వార్డు టీడీపీ నాయకులు ఎస్. ఫిరోజ్, పవన్‌కుమార్, శేషసాయి ఆధ్వర్యంలో గౌరు దంపతులు రాష్ట్రా స్థాయి రెండు, మూడో విజే తలుగా నిలిచిన కరాటే క్రీడాకరులు జయకర్, నికిల్‌లను అభినందిం చారు. కార్యక్రమంలో కోచ్ రామాంజనేయులు పాలొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 3: వర్షాకాలంలో వచ్చే వైరల్ జ్వరాలతో నగర వాసులు జాగ్రత్తగా ఉండాలని గడ్డా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాత్విక అన్నారు. మంగళవారం నగరంలోని ఆరోగ్య కేంద్రంలో ఆశా డే కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గర్భిణికి అవసరమైన పరీక్షలు రెగ్యులర్‌గా చేయాలన్నారు. ఇన్‌చార్జి డెమో శ్రీనివాసులు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, ఆశా కార్యకర్తలు, ప్రొజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనాలివ్వాలి

కల్లూరు, సెప్టెంబర్ 3: ఆశా వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ నగర కార్యదర్శి సీహెచ్.సాయిబాబా, నగర నాయకులు టి.రాముడు కోరారు. మంగళవారం గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ కల్లూరు, ముజఫర్‌నగర్, శరీన్‌నగర్, ఇందిరాగాంధీ నగర్, ఇల్లూరునగర్, వీకర్‌సెక్షన్‌కాలనీ ప్రథమిక ఆరో గ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జీఏసు, కృష్ణవేణి, రాణి, రేణుక, జ్యోతి, మహేశ్వరి పాల్గొన్నారు.

వరద బాధితులకు పొదుపు మహిళల సాయం



విజయవాడకు ఆహార పదార్థాలు తరలిస్తున్న పొదుపు మహిళలు

ఓర్వకల్లు, సెప్టెంబరు 3: ఓర్వకల్లు మండల పొదుపు మహిళలు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విజయవాడ వరద బాధితుల సహాయార్థం పెద్ద మొత్తంలో ఆహార పదార్థాలు, పిండి వంటలు, తినుబండారాలను స్వయంగా తయారు చేసి పంపించారు. డీఆర్డీఏ పిడి సలీంబాషా, ఏపీఎం వెంకటరామిరెడ్డి, మండల ఐక్య సంఘం అధ్యక్షురాలు రత్నమ్మ, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

విజయవాడకు లక్ష వాటర్ ప్యాకెట్లు

కర్నూలు(న్యూసిటీ): విజయవాడలో వరద బాధితులకు కర్నూలు జిల్లా రూరల్ వాటర్ డిపార్టుమెంటు అధికారులు లక్ష వాటర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. మంగళవారం ఈ శాఖ ఎస్ఈ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో లక్ష వాటర్ ప్యాకెట్లను విజయవాడలోని పలు ప్రాంతాలకు సరఫరా చేశారు.

విజయవాడకు అధికారులు, ఉద్యోగులు: విజయవాడలో వరదల నేపథ్యంలో శానిటేషన్ పనికి కర్నూలు నగర పాలక సంస్థ నుంచి ఇంజనీర్లు, అధికారులు, వంద మంది పారిశుధ్య కార్మికులను తరలించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్మికులు, ఇంజనీర్లు హుటా హుటిన తరలివెళ్లి విజయవాడలో పారిశుధ్య సేవా కార్యక్రమాలు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న అధికారులు, గణేశ్ కమిటీ సభ్యులు

కోడుమూరు, సెప్టెంబరు 3: గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని తహసీల్దార్ వెంకటేష్‌నాయక్ అన్నారు. మంగళవా రం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల ఏడో తేదీన జరగబోయే వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. మండలపాల దగ్గర తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, మూడో రోజు జరిగే గణేశ్ ఊరే గింపు, నిమజ్జనాన్ని భక్తులు ప్రశాంతంగా ముగించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఎస్ఐ ఏపీ శ్రీనివాసులు, ట్రాన్స్‌కో ఏఈ ఇస్మాయిల్, పంచాయతీ కార్యదర్శి అజయ్ భాస్కర్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, ఈశ్వర్‌రెడ్డి, రవి పాల్గొన్నారు.

ఆర్‌యూలో అక్రమాలపై విచారణ వేగవంతం చేయాలి

ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రప్ప



మాట్లాడుతున్న రాగిరి చంద్రప్ప

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 3: రాయలసీమ యూనివర్సిటీలో నిబంధనలకు విరుద్ధంగా జరిగిన, జరుగుతున్న అక్రమాలు, అవకతవకలపై ప్రభుత్వం విచారణ వేగవంతం చేయాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని బిర్లా కాంపౌండ్‌లోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా నాన్ టీచింగ్ ఉద్యోగులకు టైంస్కేల్ వర్తింప చేసి అక్రమంగా జీత భత్యాలు మంజూరు చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో అంబేడ్కర్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మధుకృష్ణ, టీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామరాజు, కార్యదర్శి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో భారీ వర్షం

గూడూరు, సెప్టెంబరు 3: మండలంలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గత నాలుగైదు రోజులుగా వర్షం కురుస్తుండటంతో మట్టి మిద్దెలో నివాసం ఉంటున్న జనం బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు.

కూలిన మట్టి మిద్దె

ఓర్వకల్లు, సెప్టెంబరు 3: మండలంలోని ఎన్.కొంతలపాడు గ్రామంలో మంగళవారం ఓ మట్టి మిద్దె కూలింది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన సుంకన్నకు చెందిన మట్టి మిద్దె గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిని ఉదయం ఒక్కసారిగా కుప్పకూలింది. ఆ సమయంలో ఇంట్లోని వారు బయట ఉన్న రేకుల షెడ్డులో ఉన్నందున ప్రాణాపాయం తప్పింది.

తోటి ఉద్యోగులను ఆదుకోవడం అభినందనీయం

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 3: ప్రమాదవశాత్తు మృతి చెందిన కుటుంబాన్ని ఆదుకోవడం అభినందనీయమని ఎక్సైజ్ సూపరింటెండెంట్ వినోద్ కుమార్ అన్నారు. మంగళవారం ఎక్సైజ్ కార్యాలయంలో సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్, సీఐ రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఓబులేష్ ఇటీవల మృతి చెందిన కానిస్టేబుల్ భార్య సంధ్యకు రూ. 74 వేల ఆర్థిక సాయం అందించారు. మధుసూదన్‌రెడ్డి, జగన్నాథం పాల్గొన్నారు.

మసీదు స్థలాన్ని కాపాడాలి

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 3: నగరంలోని బుడాన్ ఖాన్ మసీదు స్థలాన్ని కాపాడాలని ఆవాజ్ కమిటీ నగర కార్యదర్శి ఎస్ఎండీ షరీఫ్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి సునీల్ కన్నయ్యకు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఇస్మాయిల్, యాకూబ్ పాల్గొన్నారు.

యోగాను అభివృద్ధి చేయడమే లక్ష్యం

జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శివరాజ్

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 3: యోగాను అభివృద్ధి చేయడమే లక్ష్యమని జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శివరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ అవుట్‌డోర్ స్టేడియంలో యోగా హాలులో మంగళవారం జిల్లా స్థాయి అంతర్ పాఠశాలల యోగా ఎంపిక పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు ముఖ్యఅతిథులుగా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శివరాజ్ హాజరయ్యారు. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన క్రీడాకారులను ఆయన అభినందిస్తూ పరిచయం చేసుకుని అనంతరం మాట్లాడుతూ యోగా వలన మన శరీరంలో అనేక అద్భుతాలు జరుగుతాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయుల అధ్యక్షుడు జిల్లా ప్రైవేటు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు చిన్న సుంకన్న, వ్యాయామ ఉపాధ్యాయులు గీత, సుప్రియ, రాజేశ్వరి, దేవమణి, లీలావతి, చంద్రకళ, ప్రభాకర్ యాదవ్, రంగస్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శివరాజ్

జగనన్న కాలనీ కథ కంచికి..!

- ఊరికి దూరంగా లోతట్టు ప్రాంతాల్లో స్థలాల కేటాయింపు
- ఇళ్లు నిర్మించి ఇస్తామని మరిచిన గత వైసీపీ ప్రభుత్వం
- చీరలు, తడికెల గుడిసెల్లో బుడగ జంగాల కుటుంబాలు



కోసిగిలోని జగనన్న కాలనీలో బుడగ జంగాల పూరిగుడిసెలు

కోసిగి, సెప్టెంబరు 3: మండలంలోని కోసిగితో పాటు జంపాపురం, కందుకూరు, జుమాలదిన్నె, సజ్జలగుడ్డం, కోల్‌మాన్‌పేట, తదితర గ్రామాల్లో జగనన్న కాలనీల పేరిట గత వైసీపీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చింది. అయితే అవి ఊరికి దూరంగా, లోతట్టు ప్రాంతాల్లో ఇవ్వడంతో నిరుఉపయోగంగా మారాయి.

జంపాపురంలో 23 మందికి స్థలం ఇవ్వగా, ఓ ప్రైవేట్ కంపెనీ ఇళ్లు కట్టిస్తామని పునాదులు తీసి వదిలేశారు. అలాగే కోల్‌మాన్‌పేటలోని లోతట్టు ప్రాంతంలో 180 మంది లబ్ధిదారులకు స్థలాలు ఇవ్వగా అవి చెరువులను తలపిస్తున్నాయి. ఇక జుమాలదిన్నెలో 117మందికి స్థలాలు ఇచ్చారు కాని ఇళ్ల నిర్మాణాన్ని మరిచారు. కాగా కోసిగికి 2 కి.మీ.ల దూరంలో 900 లబ్ధిదారులకు శ్మశానం సమీపంలో ఇళ్ల స్థలాలు ఇచ్చారు. సజ్జలగుడ్డం రోడ్డులో 20 బుడజంగాల కుటుంబాలకు స్థలాలిచ్చారు కాని ఇళ్లు నిర్మించలేదు, దీంతో వారు చీరలు, తడికెలతో పూరి గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారు. సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

పూరి గుడిసెల్లో ఉంటున్నాం



ఇంటి స్థలం ఇచ్చారు కాని ఇళ్లు నిర్మించలేదు. తప్పని పరిస్థితుల్లో చీరలు, టార్పాలిన్లు కట్టుకుని నివసిస్తున్నాం. **- బుడగ జంగాల శంకర్**

ఇళ్లు నిర్మిస్తామని చెప్పారు



గత ప్రభుత్వం స్థలంతో పాటు ఇంటిని నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు, ఇంతవరకు నిర్మించలేదు. చేసేదేమీ లేక గుడిసె వేసుకున్నాం. విష పురుగులతో ఇబ్బంది పడుతున్నాం. **- శివమ్మ, కోసిగి**

అమ్ముకుంటున్నారు

- అణువుగాని చోట ఇవ్వటమే కారణం



స్థలాలు అమ్ముకుంటున్న జగనన్న కాలనీ

మద్దికెర: మండల కేంద్రంలోని సర్వే నెం. 554/1 ఐదెకరాల్లో 362 మంది లబ్ధిదారులకు, ఎస్సీ కాలనీ నాలుగెకరాల్లో 446/1 సర్వే నెంబరులో 206 మందికి ఇంటి పట్టాలు ఇచ్చారు. కాగా 446/1 సర్వే. నెంబరులో దాదాపు 70 మంది ఇళ్లు నిర్మించుకోగా 554 సర్వే నెంబరులో ఒక్క ఇల్లు కూడా కట్టుకోలేదు. ఈ స్థలంలో ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు అవుతుందని 80 శాతం మంది లబ్ధిదారులు అమ్ముకున్నట్లు తెలుస్తోంది. తహసీల్దార్ హుశేన్‌సాహెబ్‌ను వివరణ కోరగా.. ప్రభుత్వ స్థలాలు అమ్మినా, కొనుగోలు చేసినా చెల్లవని, ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటానని అన్నారు.

ఆదుకోవడం చంద్రబాబుకే సాధ్యం

ఆదోని టౌన్, సెప్టెంబరు 3: విజవాడ వరద బాధితులను ఆదుకోడానికి స్వయంగా రంగంలోకి దిగడం సీఎం చంద్రబాబుకే సాధ్యమని మాజీ టీడీపీ కౌన్సిలర్ బాలాజీ మండిగిరి ఇన్‌చార్జి శ్రీనివాస ఆచారి అన్నారు. మంగళవారం మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకోవాల్సిందిపోయి చంద్రబాబుపై జగన్ అర్థంలేని ఆరోపణలు చేయడాన్ని బాధితులే విమర్శిస్తున్నారని అన్నారు.

నేత్ర దానంతో మరొకరికి వెలుగు

గోనెగండ్ల, సెప్టెంబరు 3: నేత్రదానం ప్రపంచాన్ని చూపుతుందని జిల్లా అంధత్వ నివారణ వైద్యులు రమేష్, కార్తీక్, రమేష్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో 39వ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహించారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా 8వ తేదీ వరకు అవగాహన కల్పించాని సూచించారు. సిబ్బంది జగదీష్, శాంతమ్మ, భారతి పాల్గొన్నారు.

ఆక్రమణలను తొలగించాలి

ఆదోని టౌన్, సెప్టెంబరు 3: వీర శైవుల శ్మశాన వాటిక ప్రహరీ చుట్టూ ఆక్రమణలను తొలగించాలని జంగమ వీర శైవ హక్కుల పోరాట సమితి నాయకులు కన్నె జగదీష్, గాజుల చంద్రశేఖర్ కోరారు. మంగళవారం మాట్లాడుతూ, అంత్యక్రియల సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, పట్టణ ప్రణాళిక అధికారులు ఆక్రమణలను తొలగించాలని కోరారు.

జీడీపీ కింద జోరుగా వరినాట్లు



గోనెగండ్లలో వరినాట్లు వేస్తున్న కూలీలు

గోనెగండ్ల, సెప్టెంబరు 3: మండలంలో గాజులదిన్నె ప్రాజెక్టు కింద వరినాట్లు జోరుగా వేస్తున్నారు. గాజులదిన్నె, ఐరన్‌బండ, హెచ్ కైరవాడి, వేముగోడు, పుట్టపాశం, పెద్దనేలటూరు, ఎన్నెకండ్ల, గోనెగండ్ల గ్రామాల్లో అధికంగా వరి సాగు చేస్తున్నారు. దాదాపు 7వందల ఎకరాల్లో వరి సాగుచేస్తున్నారు. సోనా మసూరి, జీలకర సోనా, 65 డీపీ, తెల్ల హంస, కర్నూలు సోనా, రకాలను సాగు చేస్తున్నారు.

ఎస్ఐని కలిసిన టీడీపీ నాయకులు

తుగ్గలి, సెప్టెంబరు 3: టీడీపీ మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు, శ్రీనివాసులు గౌడు, డా. చంద్ర కోరారు. మంగళవారం ఎస్ఐ కృష్ణమూర్తిని సన్మానించారు. ఎద్దులదొడ్డి సర్పంచ్ విజయుడు, దామోదర్, ఖైరాముడు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 3: ఈ నెల 14న పత్తికొండ కోర్టు ఆవరణలో నిర్వహించనున్న మెగా లోక్‌అదాలత్‌ను వినియోగించుకోవాలని జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ఎంఎస్ భారతి సూచించారు. మంగళవారం న్యాయ సేవాధికార కార్యాలయంలో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పెండింగ్ కేసుల పరిష్కారానికి సుప్రీం కోర్టు జాతీయ లోక్‌అదాలత్‌ను ఏర్పాటు చేసిందన్నారు. రాజీమార్గమే రాజమార్గమని.. కక్షిదారులు గమనించాలని కోరారు. వివరాలకు న్యాయవాదులు, పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించి తెలుసుకోవాలని కోరారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఫ్యాక్టరీ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

తుగ్గలి, సెప్టెంబరు 3: ఏళ్ల తరబడి పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కార్మికులు డిమాండ్ చేశారు. మంగళవారం జియో మైసూర్ కంపెనీ వద్ద ధర్నా చేశారు. జియో మైసూరు గోల్డ్ మైనింగ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు పగిడిరాయి, జొన్నగిరి గ్రామాల్లో తమ పొలాలు ఇచ్చామన్నారు. ఉద్యోగం ఇస్తామని చెప్పి, ఏళ్ల తరబడి పని చేస్తున్నా రూ.9 వేల నుంచి రూ.11,500 మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బయటి ఉద్యోగులకు రోజుకు రూ.1000 అందిస్తున్నారు. కంపెనీ పీఆర్‌వో రామ్మోహన్ సోమిరెడ్డిని వివరణ కోరగా.. కార్మికులు తమ సమస్యలను తన దృష్టికి తెస్తే యాజమాన్యానికి తెలియజేసి న్యాయం చేస్తామని అన్నారు.

ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి



ఉపాధ్యాయులతో విద్యార్థి నాయకుల వాగ్వాదం

నందవరం, సెప్టెంబరు 3: హెచ్‌ఎం, పాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు రఘునాథ్, సురేష్ డిమాండ్ చేశారు. మంగళవారం పూలచింత పాఠశాలను సందర్శించగా హెచ్‌ఎం నరేష్, ఉపాధ్యాయుడు పవన్ దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. భోజనం, గుడ్లు సరిగా ఇవ్వలేని విద్యార్థి సంఘాల నాయకులు అడగంతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు విద్యార్థులను దూషించిన విషయంపై అడుగగా హెచ్‌ఎం రేపటి నుంచి సరిగా ఇస్తానని అంటున్నారని హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 3: అమరావతి నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు మంగళవారం రోటరీ క్లబ్ సభ్యులు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. వాలీబాల్, హాండ్ బాల్, సాఫ్బాల్, త్రో బాల్ రూ. 25 వేల విలువ చేసే క్రీడా పరికరాలు అందజేశారు. అధ్యక్షుడు సందీప్ రెడ్డి, సభ్యులు పైపుల సాబీర్ అహ్మద్, పంపాపతి, ప్రశాంత్, గాంధీ, సునీల్ రెడ్డి పాల్గొన్నారు.

విశేష పంచామృతాభిషేకం

మంత్రాలయం, సెప్టెంబరు : మఠంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మ దేవతకు విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. మంగళవారం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్మలవిసర్జనం, క్షీరాభిషేకం, కుంకుమ సేవ, విశేష పంచామృతాభిషేకం చేసి పట్టుచీర, బంగారు,వెండి ఆభరణాలుతో పాటు వివిధ రకాల పుష్పాలు, ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

నందవరం, సెప్టెంబరు 3: నాగలదిన్నె గ్రామానికి చెందిన ఇమ్మానుయేలు(48) విద్యుదాఘాతంతో మంగళవారం మృతి చెందాడు. వివరాల మేరకు.. మహబూబ్ అనే వ్యక్తికి చెందిన కోళ్ల ఫారంలో పనిచేస్తుండగా మోటర్ ఆన్ చేయబోయి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. మృతునికి ముగ్గురు పిల్లలు ఉన్నారు.

సిబ్బంది కొరత లేకుండా చూస్తాం

దేవనకొండ, సెప్టెంబరు 3: సిబ్బంది కొరత లేకుండా చూస్తామని డీఐజీ కోయ ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం దేవనకొండ స్టేషన్‌ను తనిఖీ చేశారు. సీఐ విజయభాస్కర్ .పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య ఉన్నారు.

రాష్ట్రాన్ని గాడిలో పెట్టేది చంద్రబాబే

- ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు , సెప్టెంబరు 3: రాష్ట్రాన్ని గాడిలో పెట్టేది చంద్రబాబేనని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ చాంబర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ భారీ వర్షాలతో మధ్యలోనే సీఎం నిత్యం ప్రజలతో ఉంటూ వారికి సేవలు అందిస్తున్నారని అన్నారు. ఇవేమీ పట్టించుకోకుండా వైసీపీ అధినేత జగన్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని అన్నారు. విజయవాడ వరద బాధితులను ఆదుకోవాల్సింది పోయి రాజకీయం చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వరద బాధితులకు జగన్ కనీసం ఓ వాటర్ బాటిల్ కూడా ఇచ్చిన పాపాన పోలేదన్నారు. తుంగభద్ర ప్రాజెక్టు గేటు కొట్టుకుపోతే తెలుగు ఇంజనీర్‌తోనే సీఎం చంద్రబాబు సరి చేశారని అన్నారు. ఇలానే వ్యవహరిస్తే వైసీపీ రాబోయే రోజుల్లో 2 సీట్లకే పరిమితం కావాల్సి ఉంటుం దన్నారు. 100 యూనిట్ల వరకు విద్యుత్ సబ్సిడీ ఇస్తామని అన్నారు. పట్టణాన్ని యూజీడీ పేరుతో గుంతలమయంగా మార్చి, ఎందరో చావుకు వైసీపీ నాయకులు కారకులయ్యారన్నారు. చేనేతలకు వైసీపీ నాయకులు అరకొర సాయం చేసి చేతులు దులుపుకున్నారన్నారు. టీడీపీ హయాంలో తాము తెచ్చిన ప్రాజెక్టులకు వైసీపీ నాయకులు పేరు పెట్టుకొని తామే తెచ్చామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు.



గోనెగండ్ల: ప్రశంసా పత్రాన్ని ఇస్తున్న ఎమ్మెల్యే

కార్యకర్తలందరికీ గుర్తింపు

గోనెగండ్ల: పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. గోనెగండ్ల మండలం కులుమాల కార్యకర్త కురువ రాముడుకు సీఎం చంద్రబాబు పంపిన ప్రశంశాపత్రాన్ని అందజేశారు. టీడీపీ యాప్‌లో రాముడు టాప్‌స్కోరర్‌గా నిలవడంతో సీఎం ప్రశంశాపత్రాన్ని పంపారని అన్నారు. కన్వీనర్ నజీర్‌సాహెబ్, ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య నాయుడు, నాయకులు ఉన్నారు.

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

పీస్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 3 : గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి సూచించారు. మునిసిపల్ కార్యాలయంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తులు శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా పోలీసులకు సహకరించాలన్నారు. విగ్రహాల ఎత్తుతో చెట్లను నరికివేయకుండా కొమ్మలను తొలగించేలా మున్సిపల్ అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. నిమజ్జనం రోజు క్రేన్, లైటింగ్, మైక్‌సెట్ తదితర ఏర్పాటు చేయాలని, రోడ్లపై గుంతలు లేకుండా ఆర్ అండ్ బీ వారు చూడాలని అన్నారు. అగ్ని మాపక సిబబ్బంది లైఫ్ జాకెట్లతో అందుబాటులో ఉండాలని ప్రమాదాలు చోటు చేసుకోకుండా చూడాలన్నారు. ఎల్లెల్సీ, ఎస్.ఎస్ ట్యాంకుల్లో నీరు పూర్తిగా నిల్వ ఉండేలా చూడాలని, నిమజ్జనం తరువాత నీరు కలుషితం కాకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. ఆర్టీసీ బస్సుల రాకపోకల మార్గాన్ని మార్చాలని, విద్యుత్ తీగలు తెగిపో కుండా విద్యుత్ అధికారులు చూసుకోవాలన్నారు. పోలీసులు శాంతి భద్రతలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. టౌన్ సీఐ సుదర్శన్ రెడ్డి. రూరల్ సీఐ విక్రమ్ సింహ, తహసీల్దార్ శేషఫణి, డీఈ నీరజ, లక్ష్మణ్, కమిటీ సభ్యులు శివకుమార్, నరసింహులు, గిరి, అమానుల్లా, నవాజ్ పాల్గొన్నారు.

రైల్వే అధికారులను నిలదీసిన రైతులు

మద్దికెర, సెప్టెంబరు 3: పొలాలకు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నామని వంతెన కింద నీరు నిలవకుండా చూడాలని రైల్వే అధికారులను రైతులు కోరారు. మంగళవారం ఇమామ్‌సాబ్ దర్గా ఆర్‌యూబీని పరిశీలించడానికి గుంతకల్లు రైల్వే డివిజనల్ అసిస్టెంట్ మేనేజర్ అప్పారావు, జేఈ అబ్దుల్ కుమార్, పీడబ్ల్యూవో ప్రబోధ్ సింగ్ వచ్చారు. అధికారులు రావడంతో రైతులు జమేదార్ రాజు యాదవ్, రామాంజులు నిలదీశారు. పలుమార్లు పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, ఎంపీ నాగరాజు దృష్టికి తీసుకెళ్లినా, వారు ఆదేశించినా రైల్వే అధికారులు పట్టించుకోలేదన్నారు. స్పందించిన రైల్వే అధికారులు సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



రైల్వే అధికారులతో మాట్లాడుతున్న రైతులు

పంట నష్టం వివరాలు పంపుతాం

తుగ్గలి, సెప్టెంబరు 3: వర్షాలకు నీట మునిగి కుళ్లిపోయిన పంటల వివరాలను నివేదిక తయారు చేసి జిల్లా అధికారులకు పంపుతామని ఏవో పవన్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో 'నీట మునిగి కుళ్లిన పంటలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించారు. పగిడిరాయి, జొన్నగిరి గ్రామాల్లో నీట మునిగిన పంటలను పరిశీలించారు. మండలంలో దాదాపు 125 హెక్టార్లలో పంటలు నీట మునిగి కుళ్లిపోయాయని, సర్వే చేశామన్నారు. లోతట్టు ప్రాంతంలో పంటలు సాగు చేసే సమయంలో రైతులు వ్యవసాయాధికారుల సూచనలను పాటించాలన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

మీ నిధులు మీ ఇష్టం: ఎమ్మెల్యే

ఆదోని రూరల్, సెప్టెంబరు 3: సర్పంచులపై పెత్తనం చెయ్యనని ఎమ్మెల్యే పార్థసారథి పేర్కొన్నారు. మంగళవారం ఎంపీపీ భవనంలో ఎంపీడీవో గీతావాణి అధ్యక్షతన సర్పంచులు, సచివాలయ, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పంచాయతీ నిధులను దుర్వినియోగం చేయకుండా గ్రామాభివృద్ధికే ఖర్చు చేయాలని సర్పంచులకు సూచించారు. బిల్లులను ఎమ్మెల్యే అడ్డుకుంటున్నారని ఆరోపిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీలకు నిధులు ఇవ్వకపోవడంతో గ్రామ అభివృద్ధి కోసం సొంత నిధులు ఖర్చు చేశామని, ఇప్పటికీ కూడ చేసిన పనులకు అధికారులు బిల్లులు మంజూరు కావడం లేదని పలువురు సర్పంచులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

విజయవాడకు కార్మికులు

మద్దికెర, సెప్టెంబరు 3: పంచాయతీ కార్మికులు మంగళవారం సాయంత్రం విజయవాడకు బయలుదేరి వెళ్లారు. సర్పంచ్ బండారు సుహాసిని, జడ్పీటీసీ మురళీధర్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. విజయవాడను వరదలు ముంచెత్తడంతో ఆ ప్రాంతంలో పారిశుధ్య పనులు చేసేందుకు పంచాయతీ కార్మికులు తరలివెళ్లారని తెలిపారు. పంచాయతీ సలహాదారులు బండారు ఆంజనేయులు, రామాంజులు, టీడీపీ నాయకులు ఎస్.లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

గడువులోగా నిర్మాణాలు పూర్తి చేయాలి

- హౌసింగ్ పీడీ సిద్ధలింగస్వామి



పత్తికొండలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీడీ సిద్ధలింగస్వామి

పత్తికొండ, సెప్టెంబర్ 3: లబ్ధిదారులు గడువులోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని పీడీ సిద్ధలింగస్వామి అన్నారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రామలక్ష్మితో కలసి సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం హౌసింగ్‌స్కీంకు సంబంధించి ఇళ్ల నిర్మాణానికి వంద రోజులప్రణాళికను రూపొందించిందన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది పెండింగ్ పనులు పూర్తిచేసేలా లబ్ధిదారులకు సహకారం అందించాలని ఆదేశించచామని అన్నారు. జిల్లాలో 4,253 ఇళ్లను ఆర్‌సీ స్థాయి తీసుకెళ్లాలని అప్పుడే లక్ష్యాన్ని చేరుకోగలమని అన్నారు. మార్చి31తో గడువు పూర్తవుతుందని ఈలోగా నిర్మాణం పూర్తిచేసిన లబ్ధిదారులకు ప్రభుత్వం బిల్లులు మంజూరు చేస్తుందని తెలిపారు. అనంతరం పత్తికొండలోని ఆదోని రహదారిలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఈఈ ప్రభాకర్ ఉన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చూడాలి

మద్దికెర, సెప్టెంబరు 3: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని వైద్యాధికారులు రాగిణి, శ్రీలక్ష్మి అన్నారు. మంగళవారం ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలతో మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి అతిసార, మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ నిరంజన్‌బాబు, అక్బర్ బాషా, ఉన్నారు.

నిందితులను శిక్షించాలి

కోసిగి, సెప్టెంబరు 3: కోల్‌కత్తాలో మెడికోపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులన శిక్షించాలని, ఆశా వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో వైద్యాధికారి మనోజ్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. అనంతరం నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. సీఐటీయూ కార్యదర్శి రాముడు, ఆశా వర్కర్ల నాయకులు వెంకటమ్మ, మాట్లాడుతూ తమకు వేతనాలు పెంచాలని కోరారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పత్తికొండ, సెప్టెంబరు 3: తుగ్గలి మండలం రాంకొండ గ్రామంలో 1536 కర్ణాటక మద్యం ప్యాకెట్లను మంగళవారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ సువర్ణలత తెలిపారు. ఎస్ఐ కార్తీక్, సిబ్బంది సర్దార్, వరదరాజులు, చిన్నఈరన్న, వెంకటేష్ పాల్గొన్నారు.

కోసిగి: వందగల్లు గ్రామానికి చెందిన చూడి ఎల్లప్ప బైక్‌పై మద్యం తరలిస్తుండడగా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మంజునాథ్, ఎస్ఐ చంద్రమోహన్‌లు తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు అలాగే ఒక బైక్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు.

మంత్రాలయం: రాఘవేంద్రపురంలో వీరేష్ కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా.. ఎస్ఐ పరమేష్ నాయక్ అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని ఎమ్మిగనూరు కోర్టులో హాజరు పరచగా ఆదోని సబ్ జైలుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

సీసీ రోడ్లు నిర్మించాలి

అస్పరి, సెప్టెంబరు 3: పత్తికొండ రోడ్డులోని బీసీ కాలనీలో సీసీ రోడ్లను నిర్మించాలని సీపీఎం కార్యదర్శి హనుమంతు కోరారు. మంగళవారం మాట్లాడుతూ సిబ్బంది, సర్పంచ్ పట్టించుకోవడం లేదని బురదలో వెళ్లాల్సి వస్తోందన్నారు. మహిళా సంఘం నాయకురాలు కోటేశ్వరి, లక్ష్మి నరసమ్మ, రమాదేవి, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఉత్సవాలపై అవగాహన

వెల్దుర్తి, సెప్టెంబరు, 3: సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో మంగళవారం వినాయక చవితి ఉత్సవాలపై సీఐ మధుసూదనరావు అవగాహన సదస్సు నిర్వహించారు. వినాయక చవితి ఉత్సవాలను ఆహ్లాదకర వాతావరణంలో ఎటువంటి ఘర్షణలకు తావివ్వకుండా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలన్నారు ఎస్ఐ అశోక్ ఉన్నారు.

నిత్యావసరాల ధరలను తగ్గించాలి

వెల్దుర్తి, సెప్టెంబరు 3: నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె జగన్నాథం ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. సీపీఐ కార్యదర్శి కృష్ణ, రాజు, రామాంజనేయులు పాల్గొన్నారు.

అన్ని శాఖలు పురోగతి సాధించాలి

మద్దికెర, సెప్టెంబరు 3: మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖలు అభివృద్ధిలో పురోగతి సాధించాలని ప్రత్యేక అధికారి ఉమాదేవి అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో స్వర్ణలత, ఎంఈవో రంగస్వామి, ఈవోఆర్‌డీ మద్దిలేటి స్వామి, ఏవో ఉప్పర రవి, ఏపీవో నర్సిరెడ్డి, కార్యదర్శులు శివకుమార్, సుధాకర్, పరమేశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యపై విచారణ



విచారణ చేస్తున్న ఏవో సురేష్‌బాబు

దేవనకొండ, సెప్టెంబరు 3: రైతు మునగాల గిడ్డయ్య ఆత్మహత్యపై ఏవో సురేష్‌బాబు విచారణ చేశారు. మంగళవారం పి.కోటకొండలోని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, గ్రామస్తులతో మాట్లాడారు. రైతులు తొందరపాటు నిర్ణయాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. వీఆర్‌వో శేకన్న, వీఏహెచ్ లింగేశ్వర్ ఉన్నారు.

సామాజిక సేవ పవన్ అజెండా

ఆలూరు, సెప్టెంబరు 3: సామాజిక సేవ చేయడమే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అజెండా అని జనసేన ఐటీ కో- ఆర్డినేటర్ రంజిత్ అన్నారు. స్థానిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ప్లేట్లు, గ్లాస్‌లు పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు చత్రపతి, శ్రీనివాసులు, వీరేష్, రాముడు, ఈరన్న, పరమేష్, మల్లికార్జున, శేఖర్, మున్నా, మునీర్, జగదీష్, ఉపాధ్యాయురాలు గౌతమి, మౌనిక, దానమ్మ, గీత, రఘు రెడ్డి పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల జీతాలు పెంచాలి

ఆలూరు, సెప్టెంబరు 3: ఆశా వర్కర్లకు జీతాలు పెంచాలని సీఐటీయూ కార్యదర్శి నాగరాజు వెంకటేష్ సలోమీ డిమాండ్ చేశారు. మంగళవారం పీఎహెచ్‌సీ వద్ద నిరసన తెలిపారు. అనంతరం వైద్యాధికారి న్యూటన్‌కు వినతిపత్రం అందించారు.

ఆదోని రూరల్ : ఆశా వర్కర్లకు వేతనాలు పెంచి వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ నాయకులు వీరారెడ్డి, తిక్కప్ప డిమాండ్ చేశారు. అనంతరం ఆశావర్కర్లు రాజేశ్వరి, సుకన్య, మల్లేశ్వరి, విశాలాక్షి, నరసమ్మ తదితరులతో కలిసి పెద్దతుంబళం వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు.

కర్ణాటక మద్యాన్ని అరికట్టాలి: డీఐజీ

హాలహర్వి, సెప్టెంబరు 3: కర్ణాటక మద్యాన్ని అరికట్టాలని, అసాంఘిక కార్యాకలాపాలపై నిఘా ఉంచాలని డీఐజీ ప్రవీణ్ ఆదేశించారు. మంగళవారం ఛత్రగుడి చెక్‌పోస్టును తనిఖీ చేశారు. డీఎస్పీ వెంకటరామయ్య, సీఐ శ్రీనివాస్‌నాయక్, ఎస్ఐ చంద్ర పాల్గొన్నారు.

నిందితులను బహిష్కరించాలి

ఆలూరు, సెప్టెంబరు 3: పట్టణంలోని దళిత సామాజిక వర్గానికి చెందిన వీరేష్‌పై దాడి చేసిన బోయ రంగయ్యను గ్రామ బహిష్కరణ చేయాలని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ ఆలూరు అధ్యక్షుడు శాషం రామాంజినేయులు డిమాండ్ చేశారు..

వైసీపీ నుంచి బీజేపీలోకి చేరిక

ఆదోని, సెప్టెంబరు 3: కపటి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే పార్థసారథి సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. చేరిన వారిలో వైసీపీ నాయకులు బిలేకల్ రాజు, వెంకటస్వామి హనుమేష్, ప్రస్తుత గ్రామ విద్యాకమిటీ చైర్మన్ రవి ఉన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేంద్ర కుమార్, అసెంబ్లీ కో కన్వీనర్ నాగరాజు గౌడ్, మాజీ ఎంపీపీ పంపాపతి, గ్రామ బీజేపీ నాయకులు వెంకట స్వామి, ప్రస్తుత విద్యా కమిటీ చైర్మన్ రవి, రాఘవేంద్ర, రాజబాబు, వీరేష్, క్రైపాల్ పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు పెట్టాలి

కౌతాళం, సెప్టెంబరు 3: అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫొటోలను ఉంచాలని టీడీపీ నాయకులు అమ్ముపలి, అద్దాల శ్రీరాములు, రామలింగ, వీరేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన కౌతాళంలో మంగళవారం వెలుగు కార్యాలయంలో నేటికీ సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు లేకపోవడంతో వెలుగు ఏపీఎం రాజశేఖర్‌ను నిలదీశారు.

7న మద్యం దుకాణాల బంద్

ఎమ్మిగనూరు రూరల్ , సెప్టెంబరు 3: తమ డిమాండ్లను పరిష్కరించాలని ఈనెల 7వ తేదీన మద్యం దుకాణాల బంద్‌ను చేపడుతున్నట్లు సేల్స్‌బాయ్స్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఎలైట్ దుకాణం ముందు నిరసన తెలిపారు. హెచ్.రాజు, సతీస్‌కుమార్, శేఖర్, మహేంద్ర పాల్గొన్నారు.

వరకట్నం వేధింపుల కేసు నమోదు

మంత్రాలయం, సెప్టెంబరు 3: మండలంలోని చెట్నహల్లి గ్రామానికి చెందిన ద్రాక్షాయణి (20) భర్త, అత్తామామలు కట్నం కోసం వేధిస్తున్నారని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పరమేష్ నాయక్ మంగళవారం తెలిపారు. చెట్నహల్లికి చెందిన కురువ పెద్దిరెడ్డి, లలితమ్మ కూతురు ద్రాక్షాయణిని ఎమ్మిగనూరు మండలం వెంకటాపురం కురువ రంగన్న, ఈరమ్మల కొడుకు వుశేనీకి ఇచ్చి ఏడాదిన్నర క్రితం వివాహం చేశారు. కట్నం కోసం పెడుతున్న వేధింపులు తాళలేక తల్లిదండ్రుల సహకారంతో ఆమె మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.